వీక్షణం

Veekshanam Fortnightly

ఆర్థిక, సామాజిక పక్ష పత్రిక

సంపుటి:2 సంచిక: 1, 2 జనవరి 1-31, 2005

ఉచిత విద్యుత్తు సామాజిక బాధ్యత

లోపభూయిష్టమైన వైద్యరంగ విధానాలు

వ్యవసాయోత్పత్తుల ముందస్తు వాణిజ్యం

మళ్లీ ప్రపంచబ్యాంకు ఊబిలోకి...

వీక్షణం పక్ష పత్రిక,

సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చి అండ్ కమ్యూనికేషన్,

101, మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్- 500029

‘వీక్షణం’ విస్తృతిలో భాగస్వాములు కండి!

రెండు సంవత్సరాలుగా వీక్షణం ను ఆదరిస్తున్న పాఠకులకు మూడో సంవత్సరంలోకి అడుగు పెడుతున్న వీక్షణం సంపాదకవర్గం వినమ్రంగా కృతజ్ఞతలు తెలియజేస్తోంది. తెలుగు సమాజంలో ‘వీక్షణం’ వంటి సామాజికార్థిక పత్రిక అవసరాన్ని గుర్తించిన పాఠకులకు ధన్యవాదాలు. అయితే, ఈ పత్రిక నిలదొక్కుకోవాలంటే, పాఠకులకు, సమాజానికి అవసరమైన విషయాలను అందించాలంటే మరింతగా పాఠకుల భాగస్వామ్యం అవసరం. రచనలపై అభిప్రాయాలు తెలియజేయడం, రచనలు చేయడం, చందాలు చేర్పించడం, విడిప్రతులు అమ్మడం, ప్రకటనలు సేకరించడం వంటి ఏ రూపంలోనైనా పాఠకులు ‘వీక్షణం’ అభివృద్ధిలో పాలు పంచుకోవచ్చు. ‘వీక్షణం’ మీ పత్రిక, మన పత్రిక. దీన్ని కలకాలం కాపాడుకుందాం.

-సంపాదకవర్గం

‘వీక్షణం’ చిరునామా మార్పు, చందా పెంపుదల

మూడో సంవత్సరంలో ప్రవేశిస్తున్న ‘వీక్షణం’ ఇక నుంచి సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్ (సిడిఆర్‌సి) ప్రచురణగా వెలువడుతుంది. అందువల్ల ఇకనుంచి రచనలు, ఉత్తరాలు, చందాలు విరాళాలు పంపవలసిన చిరునామా:

ఎడిటర్, వీక్షణం,
సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చి అండ్ కమ్యూనికేషన్,
101, మైత్రి రెసిడెన్సీ,
3-6-394, స్ట్రీట్ నం.3, హిమాయత్‌నగర్
హైదరాబాద్-500 029
ఫోన్ నం: 55843495

పెరిగిపోతున్న న్యూస్‌ప్రింట్, నిర్వహణా వ్యయం కారణంగా వీక్షణం పాఠకుల మీద మరికొంత అదనపు భారాన్ని మోపక తప్పడం లేదు. ఈ సంచిక నుంచి విడిప్రతి రు.6, రెండు పక్షాల సంయుక్త ప్రతి రు. 12, సంవత్సర చందా రు.150 గా మారుతోంది. గమనించగలరు.

-సం.

ఉత్తరాలు:

నేను వీక్షణం చందాదారుణ్ణి. రెగ్యులర్ పాఠకుణ్ని. వీక్షణం సామాజిక కార్యకర్తలకు, రాజకీయ కార్యకర్తలకు చాలా ఉపయోగకరంగా ఉంది. విద్యారంగం పైన కూడ మీరు ఒక ప్రత్యేక సంచిక ప్రచురిస్తే బాగుంటుందని నా విజ్ఞప్తి.

-డి. రవినాయక్, హైదరాబాద్

గౌరవ సంపాదకులు: ఎ.బి.కె. ప్రసాద్
ప్రధాన సంపాదకులు: వి. హనుమంతరావు
వర్కింగ్ ఎడిటర్: ఎన్. వేణుగోపాల్

సలహా మండలి:
ప్రొ॥ ఆర్.వి.ఆర్.చంద్రశేఖరరావు
ప్రొ॥ వకుళాభరణం రామకృష్ణ
ప్రొ॥ చక్రధరరావు
కాత్యాయని
బి.సాంబశివరాజు

విడి ప్రతి: రూ॥ 12/-
వార్షిక చందా:రూ॥150/-లు

వీక్షణం

ఆర్థిక, సామాజిక పక్షపత్రిక
సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చి అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ
సంపుటి: 2 సంచిక: 1, 2 జనవరి 1-31, 2005

సంపాదకీయం:

సునామిలో సామ్రాజ్యవాదం

దక్షిణాసియా, ఆగ్నేయాసియా దేశాలలో డిసెంబర్ 26 ఉదయం సంభవించిన భూకంపం, ఉప్పెన, అసాధారణమైన రీతిలో ఎగసిపడిన సముద్ర ఉత్పాతం రెండు లక్షల ప్రాణాలు బలిగొన్నాయి. ఇండొనేషియా సముద్ర జలాల్లోని సుమత్రాద్వీపం నుంచి మొదలయి థాయిలాండ్, మయన్మార్, బంగ్లాదేశ్, భారతదేశం, శ్రీలంక, మాల్దీవుల దాకా మాత్రమే కాదు పశ్చిమాఫ్రికా తీరప్రాంతాలలో కూడ విలయం సృష్టించిన సునామిలో బంధుమిత్రుల ప్రాణాలు కోల్పోయిన, నష్టపడిన బాధిత కుటుంబాలన్నిటి దుఃఖంలో ప్రపంచమంతా పాలుపంచుకోవలసి ఉంది.

అయితే సునామిని కేవలం ప్రకృతి వైపరీత్యంగా మాత్రమే గుర్తిస్తే దాని పూర్తి స్వభావాన్ని, ప్రభావాన్ని గుర్తించినట్టు కాదు. రెండు లక్షలమంది విలువైన ప్రాణాలు బలిపెట్టిన సందర్భం నుంచి మనం తగిన గుణపాఠం తీసుకున్నట్టు కాదు. సముద్ర గర్భ భూకంపం, తత్ఫలితంగా సముద్ర గర్భపు భూఫలకాలలో కదలికలు, అందువల్ల సముద్రజలాలు విసిరికొట్టబడిన వైనం ఒక భూభౌతిక శాస్త్ర పరిణామమే కావచ్చు. కాని ఆ పరిణామానికి ముందూ వెనుకా ఉన్నవి పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద రాజకీయార్థిక విధానాలు. నిజానికి ఆ విధానాల వల్లనే ఆ సహజ పరిణామపు బీభత్సం గణనీయంగా పెరిగింది.

మొట్టమొదట, ఇటువంటి భూభౌతిక పరిణామాన్ని గుర్తించి, ప్రమాదాల గురించి హెచ్చరించి, ప్రజాక్షేమం కొరకు పనిచేయడం తమ బాధ్యత అనుకునే పాలకవర్గాలు ఉంటే ఈ ప్రమాద దుష్పరిణామాలు చాల వరకు తగ్గిపోయి ఉండేవి. నిజానికి సామ్రాజ్యవాద దేశాలు, వాటి కనుసన్నలలో నడిచే వర్ధమానదేశాలు అణ్వాయుధాల మీద, యుద్ధ పరిశోధన మీద, అనవసరమైన వస్తు సామాగ్రి మీద పెట్టే వ్యయంలో పదోవంతో, ఇరవయ్యోవంతో పెట్టినా సునామి హెచ్చరిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కనిపెట్టి ఉండవచ్చు.

హిందూ మహాసముద్రజలాల్లో తిష్టవేసిన అమెరికా యుద్ధనౌకలు, జలాంతర్గాములు ఏయే అణు పరీక్షలు నిర్వహిస్తున్నాయో, వాటివల్ల ఆ సముద్రజలాలు ఎంత అల్లకల్లోలమవుతున్నాయో సిఐఎ కు, అమెరికన్ పాలకవర్గాలలో పిడికెడు మందికి తప్ప మరెవరికీ తెలియదు. ప్రస్తుత భూకంపానికి ఈ అణుపరీక్షలు ఎంతమేరకు కారణమో భవిష్యత్తులో ప్రజానుకూల శాస్త్ర, సాంకేతిక పరిశోధనలు తేల్చి చెప్పవలసిందే.

సముద్రజలాల్లో కల్లోలం రేగినప్పడు, తీరం మీదకి అలలు విరుచుకుపడినప్పడు వాటిని నిరోధించడానికే సాంప్రదాయిక వివేకం సరుగుడు తోటలను, మడ అడవులను పెంచింది. భూబకాసురుల, సముద్రతీర బకాసురుల అత్యాశల వల్ల సముద్ర తీరాలను బోడులుగా మార్చడం మాత్రమే కాదు, సముద్రతీరం దాకా విహార కేంద్రాలను, విలాస కేంద్రాలను నిర్మించడం జరిగింది. నూతన ఆర్థిక విధానాలలో భాగంగా పర్యాటక పరిశ్రమకు పెద్ద పీట వేసి, సముద్రతీరాన్ని మత్స్యకారుల నుంచి కొల్లగొట్టి బలిసిన దారల విహార కేంద్రంగా మార్చి వేయడం జరిగింది. దీనికి ప్రతీకారమే ఇవాళ సముద్ర వికటాట్టహాసం. ఈ ప్రళయ సముద్ర గర్జన అయినా మన చెవుల తుప్పవదిలించి, పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద అభివృద్ధినమూనా ఎంత ప్రజాకంటకమైనదో గుర్తింపజేయాలి.

లోపలి పేజీల్లో...

సామాన్యరైతుకు ఉచిత విద్యుత్తు ఓ సామాజిక బాధ్యత

-ఎం. వేణుగోపాలరావు

దేశంలో అందరూ సబ్సిడీలు భోజనం చేసేవారే. కాని రైతుకు సబ్సిడీ ఇవ్వాల్సి వచ్చేసరికి మిగతావారంతా రైతులమీద, సబ్సిడీలిచ్చే ప్రభుత్వం మీద విరుచుకపడిపోతారు. పారిశ్రామికవేత్తలు, ఎగుమతిదారులు ఒకపక్క 'ప్రోత్సాహకాలు', 'మినహాయింపులు', 'పన్నుల చెల్లింపుల వాయిదా' ల్లాంటి ముద్దుపేరుతో సబ్సిడీలను అనుభవిస్తూ, రెండోపక్క ఈ రైతులకిచ్చే సబ్సిడీ వల్లనే ఆర్థిక పరిస్థితి క్షీణించిపోతుందని గోల చేస్తుంటారు. అక్కడికి వీరంతా దేశ ఆర్థికాభివృద్ధిని కోరుకొంటున్నట్లు, రైతులే అడ్డం పడుతున్నారనట్లు వాదిస్తుంటారు. ఇది వాస్తవమేనా? పరిశీలిద్దాం.

పారిశ్రామికవేత్తలగోల ఏమంటే, తమనుంచి యూనిట్‌కు ఎక్కువ వసూలు చేసి, రైతుకు సబ్సిడీ ఇస్తున్నారని, ఇది తమకు నష్టమని. కానివారు దాచి పెడుతున్న విషయమేమంటే ఎక్కువ చెల్లించిన మొత్తాన్ని వారి జేబుల్లోంచి ఏమీ ఇవ్వటం లేదు, ఉత్పత్తికి జరిగే ఖర్చులో ఆ అదనపు మొత్తాన్ని చేర్చి, దాని ఆధారంగా ధర నిర్ణయించి వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు. వీరిదే మరో వాదన వుంది. మేమూ విద్యుచ్ఛక్తి వినియోగదారులమే. మావద్ద నుంచి ఎక్కువ వసూలు చేసి, మరో గ్రూపు వినియోగదారులకు చెల్లించడమేమిటి? వాదన బాగానే వుంది కాని విషయమేమంటే మొదటిరకం వినియోగదారులు వారి లాభాలకోసం నడిపే కర్మాగారంలో ఉత్పత్తికి విద్యుచ్ఛక్తిని ఒక ఇన్‌పుట్ గా వినియోగిస్తారు; మిగతా వారికి అదొక సేవ మాత్రమే. ప్రభుత్వానికి రైతులమీద అంత ప్రేమవుంటే మీరే మీ బడ్జెట్ నుంచి ఇచ్చుకోండి, మేం ఎందుకివ్వాలి అనేది మూడో వాదన. ప్రభుత్వ నిధులంటే ప్రజలంతా చెల్లించే పన్నులనుంచి వచ్చే ఆదాయం; మంత్రుల జేబుల్లోంచి ఏమీ ఇవ్వటం లేదు. అంటే ఇది కూడా క్రాస్-సబ్సిడీయే కదా. అంటే ఒకరు చెల్లిస్తే, మరొకరికి ఇవ్వటమే. కాగా క్రాస్-సబ్సిడీ ఏదో రూపంలో అవసరమవుతుంది. పారిశ్రామికవేత్తలు రెండు చేతుల్తో లాభాలు చేసుకొంటున్నారు కాబట్టి, దేశంలో 104 కోట్లమందికి తిండి పెట్టే రైతుకు అందులో ఒక బుల్లివాట ఇమ్మంటున్నారు. రైతుకిచ్చే సబ్సిడీలకు వ్యతిరేకులకు ఇంకా దింపుడు కళ్లాం ఆశపోలేదు. విద్యుచ్ఛక్తికి ఇలా ఎక్కువ ఛార్జీలు మావద్ద నుంచి వసూలు చేస్తే, ఉత్పత్తి ఖరీదు పెరుగుతుంది; మేము అంతర్జాతీయ మార్కెట్లో ఎలా పోటీ చేయగలం? అందుచేత తగ్గించాలనేది పారిశ్రామిక వేత్తల మరో వాదన. ఒకవస్తువు ఉత్పత్తి చేయాలంటే విద్యుచ్ఛక్తి ఒక్కటే చాలదు. పెట్టుబడులు, దానిమీద వడ్డీలు, ముడిసరుకులు, జీతాలు, మానేజర్ల ఇంటి అద్దెలు, కారు అలవెన్సులు-ఇలా సవాలక్ష ఖర్చులుంటాయి. కాగా ఒక్క విద్యుచ్ఛక్తి ఛార్జీ పెరిగినంత మాత్రానే, పోటీ పడలేని పరిస్థితి ఏర్పడుతుందా? దేశంలో నాలుగు లక్షల పరిశ్రమలు కాయిలా పడ్డాయంటే దానికి ఒక్క విద్యుచ్ఛక్తి ఛార్జీలు పెరగడమే కారణమా? చాలామంది పారిశ్రామికవేత్తలు ఎగుమతి చేస్తుంటారు. ఇలాంటి వారికి సబ్సిడీ ఇవ్వమంటే, ఆ వస్తువులను దిగుమతి చేసుకొనే విదేశస్తులకు సబ్సిడీ ఇవ్వటమే అవుతుంది. అలాగని సబ్సిడీ భారాన్నంతటినీ పారిశ్రామికవేత్తలే భరించాలని కాదు; కాస్త దాని నెత్తినకూడా మేకు కొట్టాలి.

విద్యుచ్ఛక్తికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందంటే, అది రైతులకు మాత్రమే ఇస్తున్నది కాదు. విద్యుత్ కేంద్రం నడపటంలోనే టెక్నికల్ కారణాలవల్ల, విద్యుచ్ఛక్తి రవాణాలో, హుక్కులు తగిలించి విద్యుచ్ఛక్తి చౌర్యంలో, ప్రయవేటు విద్యుత్ ఉత్పత్తిదారులు చేసే మతలబుల్లో-ఇలాంటి వాటన్నటికీ చేస్తున్న ఖర్చు లేదా నష్టం సబ్సిడీ ఖాతాలో జమ అవుతుంది. ఇదంతా ఒక ఎత్తయితే అసమానతలు ఇంతైవటు డింతై అన్నట్లు పెరుగుతున్న ఈ సమాజంలో ఎవరైతే అసమానతలకు గురవుతారో వారికి చేయూత నివ్వటం ప్రజల సంక్షేమాన్ని కోరే ఏ ప్రభుత్వమైనా చేయాల్సినపని; అది దాని ధర్మం.

అయినా రాయితీలతో కూడిన విద్యుత్ చెల్లింపులకే కట-కట లాడుతున్న రైతాంగానికి ఉచితవిద్యుత్‌ను అందించి ఆదుకోవాల్సిన వాస్తవాన్ని ఉపేక్షించి, రాయితీలనే ఉపసంహరించుకునేందుకు ప్రజాహిత ప్రభుత్వం సాహసించడం విడ్డూరమే అయినా అది వారి 'రాజకీయ లక్ష్య'మని తేటతెల్లమౌతుంది. మన వ్యవసాయ రంగంలో రైతాంగమంతా ఒక స్థాయిలో లేరు. సన్నకారు-చిన్నకారు రైతాంగానిదే మెజార్టీ. ఈ రైతాంగ ఉత్పత్తులకు ప్రభుత్వం కనీస మద్దతు ధరలను ప్రకటించి ఆదుకుంటున్నామని చెప్తున్నా, అవి సన్నకారు-చిన్నకారు రైతాంగానికి చేరడం లేదు. పైగా గిట్టుబాటు ధర లభ్యమయ్యే వరకూ తమ ఉత్పత్తిని నిల్వచేసే సమర్థతా ఈ రైతాంగానికి వుండదు. ఎందుకంటే సేద్యపు అవసరాలకై చేసిన అప్పులు, కుటుంబ అవసరాల కారణంగా గింజలు రాలిస్తే చాలు అట్నుంచి అటే ఈ ఉత్పత్తులు మళ్ళాల్సిన దౌర్భాగ్యం ఈ రైతాంగానిది. ఈ నేపథ్యం ప్రస్తుతం కొనసాగుతున్న పరోక్ష రాయితీలకు తోడుగా, ప్రత్యక్ష రాయితీలను అందించడం పాలకుల సామాజిక బాధ్యతని నొక్కిచెప్తుంది. మరోవైపు పాలకులు చేపడుతున్న ఆర్థిక విధానాల పుణ్యమా అని తమ ఆరుగాల కష్టం, తమదరిని చేరడమే గగన కుసుమం అయిన తీరు నేటి సేద్యానిది. ఈ రైతాంగం సేద్యపు అవసరాలను తీర్చుకోవడానికి అవసరమైన రుణ వసతితో మొదలుకుని నాణ్యమైన విత్తనాల లభ్యత, మంచి ఎరువులు, కల్తీలేని క్రిమిసంహారక మందులు, పంటలకు చీడ-పీడలు (విత్తనాలు నాణ్యమైనవి కాక), వీటికి తోడు ప్రకృతి వైపరీత్యాలు-ఫలితంగా పంట నష్టం. ఆపై గిట్టుబాటు ధరలు లేకపోవడం. ఇలా వీరి మనుగడ

దినదిన గండం నూరేళ్ళ ఆయుష్షు అన్న ధోరణికి నెట్టేయబడింది. మరి ఈ తరహా సన్నకారు-చిన్నకారు రైతాంగాన్ని, కాలువల కింద, వ్యవసాయ పంపుసెట్ల వహారాల్లో పూర్తి పంటను చేజిక్కించుకుంటున్న మోతుబరి రైతులను ఒకే గాటన కట్టి ఒక కనీస మద్దతు ధరను ప్రకటించడం ఏ తరహా సామాజిక న్యాయానికి నిదర్శనం? కనీసం ఈ పేదరైతాంగం తాము ఆరుగాలం కుటుంబసమేతంగా కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధరను ప్రకటించుకునే స్థితిలో లేదు. పైగా ఇతర వర్గ ప్రజానీకానికి సరసమైన ధరలకే ఆహార ధాన్యాలను అందించాలన్నా, ప్రజాపంపిణీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలన్నా రైతాంగానికి రాయితీల నివ్వడం అనివార్యం. అందుకనే పై రెండు లక్ష్యాల నుంచి తప్పుకునే క్రమంలోనే వుంది ప్రభుత్వం. స్వేచ్ఛా మార్కెట్ పేరిట రైతాంగాన్ని దగా చేస్తూ, వ్యవసాయరంగానికి చెందిన వందలాది కోట్ల రూపాయలను దకారులు కాజేస్తున్నారు. ఆహార ఆధారిత వాణిజ్యాల్లో (హోటల్స్, రెస్టారెంట్లు పేరిట) కోట్లకు పడగలెత్తుతున్నారు. ఈ తరహా వర్గాల నుండి ప్రజాహిత ప్రభుత్వం, విద్యుత్ క్రాస్-సబ్సిడీని వసూళ్ళు చేపట్టాల్సి వుంటుంది. కానీ అలా చేయరు.

సన్నకారు-చిన్నకారు రైతాంగాన్ని కేవలం ఉచిత విద్యుత్ ఇచ్చేస్తే వారేదో బాగుపడిపోతారా? అంటే అదీ కాదు. వారి మనుగడకు తీసుకోవాల్సిన అనేక సంక్షేమ కార్యక్రమాల్లో ఇదీ ఒకటి. నూతన ఆర్థిక విధానాల పేరిట గత ప్రభుత్వం చేపట్టిన విధానాలతో వ్యవసాయరంగం కునారిల్లి పోయిందని అనేకసార్లు చెప్పుకున్నాం. అవన్నీ తప్పుడు విధానాలే అని అధికారంలోకి వచ్చిన నేటి ప్రజాహిత ప్రభుత్వం తిరిగి అవే విధానాలకు పాల్పడటం గమనార్హం. 2000-01 సంవత్సరంలో దేశంలో విద్యుత్‌రంగ రాయితీల కేటాయింపులను పరిశీలిస్తే-గృహ వినియోగానికి రూ. 9467 కోట్లు, వ్యవసాయరంగానికి రూ. 27,085 కోట్లు, అంతరాష్ట్ర అమ్మకాలకు రూ. 487 కోట్లు కేటాయించారు. అంటే మొత్తం విద్యుత్ రాయితీల్లో 73.13% శాతం వ్యవసాయరంగానికి కేటాయించినట్టే. కానీ యూరోప్, అమెరికా వంటి దేశాలు వ్యవసాయ రంగానికిస్తున్న రాయితీలతో పోల్చిచూస్తే, మన పాలకులు వ్యవసాయ రంగానికిస్తున్న రాయితీలు బహు స్వల్పం.

వ్యవసాయరంగ రాయితీల ప్రాముఖ్యతను గుర్తించేందుకు ఒకే ఒక తార్కాణం, కాన్‌కున్‌లో జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్‌ను వ్యవసాయరంగ రాయితీల అంశమే రసాభాస చేసేసింది. విద్యుత్‌రంగ సంస్కరణల ద్వారా ప్రపంచబ్యాంకు తన లక్ష్యాలను సాధించుకోగలదా? వ్యవసాయ రంగంపై ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాల ద్వారా ఏం సాధించనుంది? (అన్న ప్రశ్నలకు సమాధానమే కాన్‌కున్ సదస్సు)

* రాయితీల కుదింపుతో కునారిల్లుతున్న భారతీయ సేద్యం అత్యధిక రాయితీలను పొందుతున్న యూరోపిన్ అమెరికన్ దేశాల సేద్యంతో స్వేచ్ఛా విపణిలో పోటీ పడగలదా?

* ఆర్థిక, రాజకీయ, సామాజిక విపక్షతల పాలయిన మన సేద్యం రాయితీలనుండి సైతం మినహాయింపబడి, విదేశీ ఉత్పత్తులతో స్వేచ్ఛా విపణిలో పోటీ పడటం ఎవరికి ప్రయోజనాల కోసం?

* విద్యుత్‌ను అందని ద్రాక్ష చేసేసి, భారతీయ సేద్యాన్ని వాణిజ్య పంటలవైపు మళ్ళించి, సామ్రాజ్యవాదుల ఊడిగానికి సంసిద్ధం కాదా ఈ విధానాల వరవడి? (2004, సెప్టెంబర్ 14,15,2004న హైదరాబాద్‌లో జరిగిన జాతీయ వర్క్‌షాప్‌లో లేవనెత్తిన అంశాలు ఇవి)

రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న రైతన్నల ఆత్మహత్యలే, తీవ్రమౌతున్న వ్యవసాయరంగ సంక్షోభానికి తాజా ఉదాహరణ. సంక్షోభ ప్రభావం భిన్న వర్గాలపై తారతమ్య స్థాయిలో వుంటుంది. 1995-96లో నమోదు భూకమతాల యాజమాన్యం ఈ విధంగా వుంది.

భూకమతాల యాజమాన్యం: 1995-96

భూకమత స్థాయి	యజమానుల సంఖ్య (లక్షల్లో)	శాతం	భూవిస్తీర్ణం లక్షల (హెక్టార్లలో)	శాతం	సగటు భూవిస్తీర్ణం (హెక్టార్లలో)
పరిమితస్థాయి	63.00	59.42	29.04	20.20	0.46
చిన్నకారు	22.62	21.33	32.39	22.47	1.43
సన్నకారు	13.95	13.16	37.36	25.99	2.68
మధ్యతరగతి	5.63	5.31	32.31	22.48	5.74
పెద్దకమతాలు	0.83	0.78	12.73	8.86	15.31
మొత్తం	106.03	100.00	143.73	100.00	1.36

(ఎపి ఎకనామిక్ సర్వే 2003-04)

రాష్ట్రంలో 106.7 లక్షల కమతాలున్నాయి; వాటి కింద 143.73 లక్షల హెక్టార్ల భూమి వుంది. 59.42 శాతం కమతాలు ఒక హెక్టారులోపు భూమి వున్న బడుగురైతుల చేతుల్లో వుంది. ఇది మొత్తం భూవిస్తీర్ణంలో ఐదో వంతు. వీరి సగటు భూపరిమితి 0.46 హెక్టార్లు మాత్రమే కాగా బడా భూస్వాముల సగటు భూపరిమితి 15.31 హెక్టార్లు.

రాష్ట్రంలో మొత్తం నీటిపారుదల వసతి వున్న భూవిస్తీర్ణ గణాంకాల విషయానికొస్తే 1983-84 సంవత్సరంలో నీటిపారుదల వసతి వున్న భూవిస్తీర్ణం 39.06 లక్షల హెక్టార్లు. ఇందులో 18.39 లక్షల హెక్టార్లు కాలువల క్రింది భూములు. మిగతా 20.67 లక్షల హెక్టార్లు చెరువులు, బావులు ఇతరత్రా విధానాల్లో నీటివసతి పొందుతున్నవి. అదే 2002-03 నాటికి మొత్తం నీటివసతి వున్న భూములు 36.14 లక్షల హెక్టార్లకు కుదింపయిపోగా, 12.09 లక్షల హెక్టార్లు కాలువల క్రిందనూ, మిగతా 24.05 లక్షల హెక్టార్లు ఇతరత్రా

నీటి వసతిని పొందుతున్నాయి. 1983-84లో బావుల నిర్వహణలో వున్న 8.37 లక్షల హెక్టార్ల సేద్యం, 2002-03 నాటికి 18.43 లక్షల హెక్టార్లుగా విస్తృత మయ్యింది.

మరో గమనించతగ్గ తేడా ఏమిటంటే, కాలువల కింద సేద్యం చేస్తున్న రైతాంగానికి దుర్భిక్ష ప్రాంతాల్లో బోర్లపై ఆధారపడి సేద్యం చేస్తున్న రైతులమధ్య వున్న తేడా. కాలువ క్రింది రైతుకు ఎకరానికి రూ.200/- నీటి తీరువాతో సరిపోతే, బావుల కింద సేద్యం చేసే రైతాంగానికి సంవత్సరానికి రూ.1500/- విద్యుత్ బిల్లు చెల్లించాల్సి వస్తుంది. పైగా అస్థిరమైన విద్యుత్ సరఫరా, లోఓల్టేజీ సమస్యలు ఫలితంగా పంట దిగుబడిలో నష్టం. ఇవే కాకుండా మోటార్లు కాలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు పాడవడం, బాగుచేయించడం వంటి అదనపు ఖర్చులను అంచనా వేయలేం. మొత్తంగా పోల్చిచూస్తే బావుల కింది సేద్యం కంటే కాలువల కింది సేద్యమే శ్రేయస్కరం. ఈ విధంగా చూసినా బావులకింద సేద్యం చేసేవారికి రాయితీల నివ్వాలి. ఇక దుర్భిక్ష ప్రాంతాల్లో బావులను నీరుపడే స్థాయి వరకూ తవ్వాల్సి రావటంతో లోతు ఎక్కువైన కొద్దీ విద్యుత్ వినిమయం పెరిగే అవకాశం వుంది.

ఈ పై వివరాలను సమీక్షించుకుంటే తేలేది, అన్ని కేటగిరీల రైతాంగాన్ని ఒక గాటను కట్టడం సరైన పద్ధతి కాదన్నదే. విద్యుత్ వినిమయ ఛార్జీల చెల్లింపులకై అనుసరిస్తున్న 'స్లాబ్ విధానం' కూడా సమమైంది కాదు. దుర్భిక్ష ప్రాంతాల్లోని సన్న చిన్నకారు రైతాంగం తమ సేద్యంతో కనీస అవసరాలను తీర్చుకోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ కారణంగా సన్న-చిన్నకారు రైతాంగానికి ఉచిత విద్యుత్‌ను అందించడం అవసరం. అంతేకాకుండా ఈ క్రింది కారణాల మూలంగా విద్యుత్ టారిఫ్‌లను వివిధ స్థాయిల్లో నిర్దేశించాల్సి వుంది.

1. ధనిక వర్గాలు సేద్యరంగంలో అడుగు పెట్టడం ద్వారా నూతన విద్యుత్ కనెక్షన్లను వారి పలుకుబడితో కైంకర్యం చేసేస్తారు. వీరు సమర్థవంతమైన పంపుసెట్లను సమృద్ధిగా నీరులభ్యమయ్యే లోతుల్లోకి చొచ్చుకుపోయి నీటిని వినియోగిస్తారు. చిన్న-సన్నకారు రైతాంగం ఆ తరహా విచ్చలవిడితనానికి పాల్పడలేరు.

2. రాజకీయ వేత్తలు, అధికార వర్గాలు, కార్పొరేట్ సంస్థలు, ధనిక వర్గాలు నిర్వహించే ఫార్మ్ సెస్, రిసార్ట్స్, ఎస్టేట్లకు ఉచిత విద్యుత్‌ను ఇవ్వరాదు.

3. వ్యవసాయ బావుల ముసుగులో భూగర్భజాలలతో వాణిజ్యం చేసే దుష్టశక్తులను నివారించాలి, తోటలు ఉద్యానవనాలు నిర్వహించే వారికి ఉచిత విద్యుత్‌ను నివారించాలి.

4. ఆదాయపన్ను చెల్లింపుదార్లకు సైతం ఉచిత విద్యుత్‌ను నివారించాలి. పారిశ్రామిక వేత్తలు, చిత్ర నిర్మాతలు, వంటి ధనిక వర్గాలు వారివారి నల్లధనం మూటలను వ్యవసాయ రంగంలో పెట్టుబడులుగా పెట్టి నలుపును తెలుపుగా మార్చేయత్నాలకు పాల్పడటమే కాకుండా వ్యవసాయరంగంలో నష్టాలను చూపి ఆదాయ పన్నులను ఎగ్గొట్టే ప్రయత్నాలకు పాల్పడుతున్నారు.

5. కాలువల కింది సేద్యం చేసేవారికి ఉచిత విద్యుత్‌ను నిషేధించాలి.

6. కార్పొరేట్ సేద్యానికి ఉచిత విద్యుత్‌ను ఇవ్వరాదు.

ఉచిత విద్యుత్‌నిస్తే దుర్వినియోగానికి పాల్పడతారన్న వాదనొకటి వినవస్తుంది. ఉచిత విద్యుత్ అయినా, కాకున్నా రోజంతా, 365 రోజుల సరఫరా నిరాటంకంగా వ్యవసాయరంగానికి కేటాయించటం లేదు కదా! ఎన్నికబుర్లు చెప్పినా ప్రస్తుతమైతే రోజుకు 8 గంటలే వ్యవసాయరంగానికి విద్యుత్‌ను అందిస్తున్నారు. జల దుర్వినియోగ విషయానికొస్తే అది ఆయా ప్రదేశాల్లో జల లభ్యతపై ఆధారపడి వుంటుంది. ఈ రెండూ చిన్న-సన్నకారు రైతాంగం పక్షం నుంచి మనం వూహించనవసరమే లేదు. ఎటొచ్చి తమకు విద్యుత్ కనెక్షన్లు రాకుంటే తమకున్న కొద్దిపాటి భూవసతి సేద్యానికి అక్రమ కనెక్షన్లు తీసుకోవడానికి సాహసించవచ్చు. చిన్న-సన్నకారు రైతాంగం వారి దినసరి మనుగడ సాగేందుకు యోచిస్తారు. నదీ జలాలక్రింద సేద్యపు వసతిని అధికం చేయడం ద్వారా బావుల క్రింది సేద్యాన్ని నియంత్రించే వీలుంటుంది. రానున్న భవిష్యత్‌లో ఈ రెండు వనరుల వినియోగం విస్తృతమయ్యే అవకాశాలే ఎక్కువగా వున్నాయి.

ఉచిత విద్యుత్‌ను ఇచ్చేందుకు నిర్దేశిత సూచనలు:

1. 5 ఎకరాల లోపు మెట్ట, లేదా 2 1/2 ఎకరాల లోపు మాగాణి వున్న రైతాంగానికే ఉచిత విద్యుత్‌ను పరిమితం చేయాలి. భూయాజమాన్య వివరాలను రెవెన్యూ శాఖా సహకారంతో కచ్చితంగా నిర్దేశించాలి.

2. ఫార్మ్‌హౌసెస్, రిసార్ట్స్, ఎస్టేట్లపై వాణిజ్య విద్యుత్ ఛార్జీలను వసూలు చేయడమే కాకుండా, క్రాస్ సబ్సిడీని వసూలు చేయాలి.

3. జల వనరుల లభ్యతను బట్టి వ్యవసాయ రంగ [illegible] గ్రేడ్‌ల వారీగా నిర్ణయించాలి.

4. నీటివసతి గల భూముల సేద్యానికై విధిస్తున్న నీటితీరువా పన్నులకు సమానంగా వ్యవసాయరంగంలో విద్యుత్ ఛార్జీలు వుండాలి.

5. రబీలో నీటివసతి అవసరమయ్యే పంటలను నిషేధించాలి.

6. ఆదాయపన్ను చెల్లింపుదార్లకు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, 3,4 విద్యుత్ పంపుసెట్లువున్న వారికి ఉచిత విద్యుత్‌ను నిరాకరించాలి.

ఇదీ చిన్న-సన్నకారు రైతాంగానికి ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు గల ఆవశ్యకతా వివరాలు. ఇక వీటిని కాదంటే 'వ్యక్తులు ప్రధానం కాదు. వారాచరిస్తున్న రాజకీయ విధానాలే' ప్రధానమన్న వాస్తవాన్ని ప్రజలు గుర్తెరుగుతారు.. గుర్తెరగాలి కూడా!

(సంక్షిప్త స్వేచ్ఛానువాదం-విద్యాభూషణ్)

లోపభూయిష్టమైన వైద్యరంగ విధానాలు

-డా.జె. శేషారెడ్డి

హైదరాబాద్ గాంధీ హాస్పిటల్‌లో ప్రమాదంలో గాయపడిన ఇంజనీరింగ్ విద్యార్థి మరణించాడు. ఈ మరణానికి డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల ఆరోపణ. తమ నిరసన తెలియజేసేందుకు హాస్పిటల్‌పై దాడి చేశారు. ప్రతిగా ఆత్మరక్షణ పేరుతో డాక్టర్లు ప్రతి దాడి చేశారు. డాక్టర్లు సమ్మె చేశారు. అది విస్తరించి రాష్ట్ర వ్యాపితంగా రోగులు తీవ్రంగా నష్టపోయారు.

అన్ని తరహాల వార్తా మాధ్యమాలకు ఇది ఉత్కంఠభరిత వార్తగా తయారైంది. ఘటనపై రకరకాల చర్చా గోష్టులు, అభిప్రాయ ప్రకటనలు జరిగాయి.

ప్రభుత్వం దీనిని కేవలం శాంతి-భద్రతల సమస్యగా చూసి, చూపించి, ఘర్షణలో వున్న డాక్టర్లను ఒప్పించి, తన చేతులు దులిపేసుకుంది.

ప్రభుత్వ వైద్య సిబ్బందికి, రోగుల బంధువులకు జరుగుతున్న ఘర్షణ ఇది మొదటిదికాదు. చివరిది కాబోదని ఆ తరువాత విజయనగరం ఘోషా ఆసుపత్రిలో జరిగిన సంఘటన చూపింది. ఎందువల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయో లోతైన విశ్లేషణ జరగడంలేదు. లోతైన పరిశీలన లేనందువల్ల, అసహనానికి దారితీస్తున్న కారణాలను తొలగించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చేసే ప్రయత్నమూలేదు.

ప్రజలలో ఇలాంటి నిరసనలు, అవి విధ్వంసానికి దారితీస్తున్న ఘటనలు జీవన రంగాలన్నిటా కనపడుతున్నది. విద్యుత్ రంగంలో లోపం వస్తే, సబ్ స్టేషన్ల మీద, అధికారుల మీద ఆగ్రహించిన ప్రజలు విధ్వంసానికి పూనుకుంటున్నారు. మార్కెట్ యార్డులో నష్టం జరిగితే రైతులు ఆఫీసును విధ్వంసం చేస్తున్నారు. యూనివర్సిటీ అధికారులతో వచ్చిన వివాదాల పరిష్కారానికి విద్యార్థులు అదుపు తప్పి వ్యవహరించిన ఘటన ఈ మధ్య కాలంలో అసెంబ్లీ ప్రాంగణంలోనే జరిగింది. నిరసనకు విధ్వంసం చిహ్నంగా మారిన సామాజిక స్థితి మనకు ఎదురౌతోంది.

ఈ నిరసనలలో అత్యధిక భాగం ప్రభుత్వ విధానాల మూలంగా తలెత్తుతున్నవే. లేదా తగిన సమయంలో ప్రభుత్వ స్పందన లేనందున సాగుతున్నవే. కాని ఏ ఘటనకు ఆ ఘటనను కేవలం శాంతి-భద్రతల సమస్యగా చూసి, చూపించి తన వైఫల్యాన్ని దాచుకుంటున్నది ప్రభుత్వం. నిరసన అవసరం రోజురోజుకు పెరుగుతున్నది. వివిధ సామాజిక వర్గాలు ఏదో ఒక సందర్భంలో నిరసన వ్యక్తం చేయక తప్పని పరిస్థితికి నెట్టబడుతున్నారు. కారణాలు వేరు కావచ్చు. ఘటనలు వివిధ సమయాలలో జరగవచ్చు. కాని తగు సమయంలో జరిగిన నష్టాన్ని, లోపాన్ని సరిదిద్దే అవకాశం ఇతర పద్ధతులలో ఎందువల్ల కనిపించడం లేదు? ఈ విషయం మనం పరిశీలించాలి. వివిధ రకాల నిరసనలకు దారి తీస్తున్న కారణాలను ప్రజలకు తెలియ చేసి తక్షణ పరిష్కారానికి ఒక వేదికను, పద్ధతిని రూపొందించే కృషి జరగాలి.

ఆ క్రమంలోనే వైద్య రంగంలో తలెత్తుతున్న ఘటనలకు పూర్వాపరాల పరిశీలనకు ప్రయత్నం ఇది.

రోగి మరణించగానే బంధువులు ఆందోళన పడడం సహజం. వారు డాక్టర్లు లేదా వైద్య సిబ్బందిపై ఆరోపణలకు, ముఖ్యంగా నిర్లక్ష్యమనే ఆరోపణకు తరచూ దిగుతున్నారు. ఎన్నో ఇబ్బందుల మధ్య, అప్పో సప్పో చేసి వైద్య సేవల మీద పెంచుకున్న ఆశలతో ఆసుపత్రికి వచ్చిన రోగి మరణిస్తే బంధువులలో కోపం, నిరాశ, నిస్పృహ, విచక్షణారాహిత్యత కనిపిస్తే ఆశ్చర్యం లేదు.

కాని రోగి బంధువుల ఆరోపణలు రుజువైన సత్యాలుగా బ్యానర్ హెడ్డింగ్‌లతో ఉత్కంఠ భరిత వార్తగా ప్రచురించడం, చూపించడం సమాచార మాధ్యమాలు తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించినట్లేనా? వారెప్పుడైనా తమను తాము పరిశీలించుకున్నారా? ఎప్పటికప్పుడు ఈ ఉత్కంఠ తను అనుభవించిన ప్రజలలో డాక్టర్ల, వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే ఏకైక కారణమనే భ్రమను పాతుకుపోయేలా చేస్తున్నాయేమో ఏనాడైనా ఆలోచిస్తున్నారా? ఎక్కువమంది పాఠకులను ఆకర్షించే పోటీలో సమాచార మాధ్యమాలు సామాజిక బాధ్యతను సజావుగా నిర్వహిస్తున్నాయా?

వైద్యరంగంలో నిర్లక్ష్యం లేదని మా వాదన కాదు. అనారోగ్య కరమైన ధోరణులు లేవని కాదు. కొన్ని సందర్భాలలో ఇవి రోగి అనవసర మరణానికి దారితీసే ఉదాహరణలు లేవనీ మేము చెప్పబోవడం లేదు. కాని నిర్లక్ష్యం, అనారోగ్యకరమైన ధోరణులు వ్యక్తిగతంగా వ్యక్తమైనా వాటికి మూలం మనదేశంలో ఈ మధ్య కాలంలో ఏర్పడిన పరిస్థితులే కారణం.

ఇవి అనేకం. కాని ప్రధాన కారణం నూతన ఆర్థిక విధానం పాలకులు చేపట్టడమే. ప్రజల అవసరాలను తీర్చే బాధ్యత నుండి

ప్రభుత్వం తప్పుకొని, ఆ స్థానం లాభాపేక్షతోనే పనిచేసే ప్రైవేట్ రంగానికి అప్పగించడమే ఇందుకు మూలం. వివిధ వర్గాల ప్రజల సామాజిక దృక్పథాలలో ఈ మార్పు ప్రతిబింబిస్తున్నది. ప్రభుత్వం ప్రజల సంక్షేమ బాధ్యతలు వదిలేసి, లాభాపేక్షను కాపాడే శాంతి-భద్రతల యంత్రంగా మాత్రమే తయారైంది. లాభాపేక్ష తన లాభాలను తప్ప ఇతర ఏ అంశాన్ని పరిశీలించదు. మనిషి ప్రాణం సహితం-లాభంతో పోలిస్తే, దాని దృష్టిలో దిగదుడుపే.

ఈ మాటలు రాజకీయ ప్రచారంగా ఉద్దేశించినవి కాదు. కాదనేందుకు ఈ రంగంలో వచ్చిన మార్పులను వివరంగా తెలియ చేస్తున్నాము.

స్వాతంత్ర్యానికి పూర్వం వైద్య రంగంలో సేవలు చాలా తక్కువ. ప్రభుత్వం తాలూకా స్థాయిలో ఆసుపత్రులు ఏర్పర్చేది. మందులు సరఫరా చేసేది. అనాడు ప్రజలకు అందుబాటులో వున్న వైద్యసేవలే తక్కువ. అందువల్లనే ప్రైవేట్‌వైద్యం సహితం వైద్య సేవలలో 5-10 శాతం మాత్రమే వుండేది. వైద్య సేవలే తక్కువ కనుక ప్రజలలో ఆరోగ్యం పట్ల, వైద్య సేవలపట్ల గూడ ఆసక్తి వుండేది కాదు. అంటు వ్యాధులను సహితం మానవాతీతశక్తుల ప్రభావంగా చూచి, జాతర్లు, తిరునాళ్ళతో పరిష్కరించుకోవాలనుకునే వారు. జబ్బుల పట్ల చైతన్యం గూడ చాలా తక్కువ.

ఇలాంటి పూర్వరంగంలో ప్రజల ఆరోగ్యం పట్ల బాధ్యత ప్రభుత్వానిదేనని స్వాతంత్ర్య ఉద్యమం, దాని మూలంగా ఏర్పడిన ప్రభుత్వాలు భావించాయి. ప్రజారోగ్యం గురించి పరిశీలించి, విధాన కల్పనకు బోర్, మొదలియార్, హాథి వంటి కమిటీలు అనేకం ఏర్పర్చారు. వీటి అన్నిటి ఫలితంగా ప్రజారోగ్య సంరక్షణకు ఒక సమగ్ర రూపం ఏర్పడింది.

సాధారణ ప్రజలలో ఎక్కువమందిలో సాధారణ జబ్బులకు మూలం తాగేనీరు, నివసించే పరిసరాలు, తగినంత, ఆరోగ్యకరమైన తిండి లేకపోవడం కారణం. అందువల్ల మంచినీరు, గాలి, నివాసం, తగిన పని చూపడం, ఆరోగ్యకరమైన పరిసరాలను ఏర్పర్చడం వ్యాధుల నివారణకు మూలంగా భావించారు. అదే విధంగా వైద్య విధానం గూడ రూపొందించారు.

శాస్త్ర పరిశోధన, మందుల ఉత్పత్తి, వైద్య సేవలు అందించేందుకు మానవ వనరులు, అందించే యంత్రాంగం, అందుకు అవసరమైన పరికరాల ఉత్పత్తి అన్నీ కలిపి ఒక సమగ్ర విధానం రూపొందింది.

ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చి, మెడికల్ కౌన్సిల్, బల్క్ డ్రగ్స్ ఉత్పత్తికి ఐ.డి.పి.ఎల్, పరికరాల ఉత్పత్తి వసతులు, ఎక్స్‌రే ఫిల్ముల తయారీకి హిందుస్తాన్ ఫోటో ఫిల్ము వంటి సంస్థలు. మానవ వనరుల అభివృద్ధికి మెడికల్ కాలేజీలు, సిబ్బంది కోసం సంస్థలు ఏర్పాటు చేసింది. సేవలు అందించేందుకు పి.హెచ్.సిల నుండి రెఫరల్ హాస్పిటల్స్ వరకు, ప్రసూతి, పౌష్టికాహారము వంటి వాటిని అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం జరిగింది.

ఇవన్నీ జయప్రదమైనాయని కాదు. ఆరోగ్యం అందరికీ అందుబాటులోకి వచ్చిందనీ కాదు. పేదలలో అత్యధికులకూ, అందులోనూ మారుమూలలో నివసించే గ్రామీణులకు, దళిత వర్గాలకు ఇవి ఈనాటికీ అందుబాటులోకి రాలేదనేది వాస్తవం.

విద్య, అన్ని రంగాలలో రాజకీయ విధానాల వైఫల్యమే ఈ రంగాన్ని ఆవరించింది. అవసరాలను తీర్చడంలో విఫలమైంది. ఆ వైఫల్యానికి అన్ని రంగాలలాగే ఈ రంగంలోనూ పేదలే మూల్యం చెల్లించవలసి వచ్చింది.

కాని ఆరోగ్య, వైద్యరంగం ప్రభుత్వ బాధ్యతగా, రాజ్యాంగ హక్కుగా భావించారు కనుక, డిమాండ్ చేసి పొందే అవకాశం ఏర్పడింది.

ఆరోగ్య, వైద్య రంగాలలో ఈ కాలంలో అనేక పెను మార్పులు ఏర్పడ్డాయి. అనేక వ్యాధులకు కారణాలు కనుక్కున్నారు. వాటి నివారణకు మందులు కనుక్కున్నారు. వైద్య రంగంలో సాంకేతికంగా ఎన్నో మార్పులు ఏర్పడ్డాయి.

ఈనాడు ప్రపంచంలో అత్యధిక రేటు లాభాలను ఇచ్చే మొదటి పరిశ్రమ ఫార్మస్యూటికల్ పరిశ్రమ. అందులో భాగంగా అత్యధిక వ్యయ ప్రయాసలు వున్న పరిశోధనారంగం, రోగ నిర్ధారణలో వచ్చిన సాంకేతిక పరికరాల నిర్మాణం పశ్చిమదేశాల బహుళజాతి సంస్థల చేతిలో కేంద్రీకృతమై వున్నది. ప్రపంచంలో మందుల తయారీలో పేటెంట్ విస్తరణతో మందుల తయారీలో గతంలో వెనుకబడిన దేశాలకు వున్న వెసులుబాటు ధ్వంసమైంది. మందుల ధరలు, రోగ నిర్ధారణ పరికరాల ధరలు ఆకాశాన్నంటాయి.

గతంలో భారత ప్రభుత్వం అనుసరించిన ద్రవ్యోల్బణ విధానంతో సిబ్బంది, నిర్వహణ, మందుల, పరికరాల ఖర్చు పెరిగింది. నిధుల అవసరాలు పెరిగాయి.

దీనికి తోడు ప్రభుత్వం ఐఎంఎఫ్ కోసం స్వాతంత్ర్యానంతరం మూడుసార్లు రూపాయి విలువ తగ్గించేందుకు అంగీకరించింది. అమెరికా ప్రభుత్వం డాలర్-బంగారం సంబంధాన్ని విడగొట్టింది. డాలర్ విలువ ఆ కరెన్సీ అవసరాలను బట్టి నిర్ణయం ఔతుంది. మన డాలర్ అవసరాలు పెరిగేకొద్ది, దానికి మనం చెల్లించాల్సిన రూపాయిలు పెరుగుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో డాలర్

4 రూపాయలు. 1990ల నాటికి 18 రూపాయలు. 1991లో రూపాయి విలువ తగ్గించినప్పుడు 32 రూపాయలు. ఈనాడు 48-50ల మధ్య వుంటోంది.

ఆధునిక మందులు, యంత్రాలు, పేటెంట్ హక్కుల ఫలితంగా స్థానిక ఉత్పత్తికి అవకాశం బుద్ధి పూర్వకంగానే ధ్వంసం చేస్తున్నారు.

దేశంలో స్థూల జాతీయోత్పత్తి పెరిగింది. అందులో ప్రభుత్వ వ్యయానికి అందే భాగం, సంపన్నులకు అనుకూలమైన ప్రభుత్వ విధానాల ఫలితంగా తగ్గింది. దీనితో ప్రజాసంక్షేమానికి ప్రభుత్వ వ్యయం తరిగింది. కాని సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు పెరిగింది. ఆ విధంగా అవసరాలకు, అందుబాటులో వున్న నిధులకు గండి ఏర్పడింది. బాధ్యతల నుండి ప్రభుత్వం క్రమేపి తప్పుకొని, వైద్యాన్ని ప్రైవేట్ రంగంపరం చేయడం ఒక విధానంగానే సాగిస్తున్నది. ప్రభుత్వం వైద్యరంగపు అవసరాలకు తగిన నిధులు సమకూర్చలేకపోవడం, వైద్యరంగం పతనానికి మూల కారణం.

ఒకనాడు వైద్యరంగపు వ్యయం కేటాయింపు, అది ఎలా తగ్గుతూ వచ్చిందో చూడండి.

తగ్గిన ఆ వ్యయంలో అత్యధిక భాగం సిబ్బంది, నిర్వహణలకు ఖర్చు ఔతోంది. సాంకేతిక అవసరాలు పెరిగి, అవి తమకు అందుబాటులోకి రావాలని ప్రజలు కోరుతున్నారు. వాటిని ప్రభుత్వం సమకూర్చడం లేదు. సిబ్బంది ఖర్చులు తగ్గించేందుకు సిబ్బంది నియమకాలు తగ్గిస్తున్నది. అయినా అసలు వైద్యంలో రోగులకు అందవలసిన మందులు, వైద్యంలో వాడవలసిన ఇతర అవసరాలు ఇవ్వలేకపోతున్నారు. విజయనగరం ఘటన అందుకు ఉదాహరణ. ప్రజలలో ఏర్పడే అసంతృప్తిని వారు ప్రత్యక్షంగా ఎదుర్కొని, బాధపడవలసి వస్తుంది. ఫలితంగా డాక్టర్లు, సిబ్బందిలో నిర్లిప్తత ఎదురౌతోంది.

దీనికితోడు వైద్యసేవా రంగంలో ప్రైవేట్‌రంగం ప్రవేశించడంతో రోగులను రాబట్టుకునే క్రమంలో ఆరోగ్యం పట్ల "భయం" పెంచడానికి సమాచార మాధ్యమాలను దుర్వినియోగపరుస్తున్నారు. ఎటువంటి రోగాన్నైనా తీర్చి మనిషిని బతికించగలమని హామీ ఇచ్చే ప్రచారం చేస్తున్నారు. దీనినుండి ఏర్పడే భ్రమలే, రోగి రక్షింపలేని దశలో చనిపోయినా, డాక్టర్ల నిర్లక్ష్యం వల్లనే చనిపోయాడనే భావం పెరిగిపోతోంది. ప్రచార సాధనాలు ఈ అభిప్రాయాన్ని బలపరుస్తున్నవి.

ప్రభుత్వం ప్రజాసంక్షేమం నుండి తొలుగుతున్నది. తమ సంక్షేమం కోసం రాజకీయ అధికార వినియోగం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ విషయంలో తమను నిర్లక్ష్యానికి గురి చేసిన రాజకీయ పార్టీని ఓడిస్తున్నారు. అన్ని రాజకీయ పార్టీలు గూడ తారతమ్య తేడాలతో ప్రైవేటీకరణను ఆమోదిస్తున్నాయి. అందువల్ల అదికార పార్టీలో మార్పు వచ్చినా, విధానాలలో గుణాత్మక మార్పు కనిపించడం లేదు. ప్రజల ఆశలకు, ప్రభుత్వాల వాగ్దానాల భంగానికి మధ్య అగాధం ఏర్పడుతున్నది. దీని ఫలితంగానే సామాజిక నిస్పృహ విచక్షణా రాహిత్యానికి, నిరసనలో విధ్వంసపు భాగం పెరిగేందుకు కారణమౌతున్నది. ఒకపెద్ద సామాజిక సమస్యగా రూపొందింది.

ప్రైవేటీకరణ సూత్రాన్ని ఆమోదించడం వల్ల వైద్యరంగంలో ఎలాంటి ఫలితాలకు దారితీశాయో, తీసే అవకాశం వుందో పరిశీలిద్దాం.

1. వైద్యరంగానికి ప్రభుత్వ వ్యయం స్థూలజాతీయోత్పత్తిలో భాగంగా గాని, ప్రభుత్వ వ్యయంలో భాగంగా గాని తగ్గిపోతోంది. దీనికి తోడు సిబ్బంది జీతాలు, నిర్వహణ, మందుల, ఉపకరణాల ధరలు పెరిగిపోతున్నాయి. అందువల్ల ప్రజలకు నేరుగా అందే మందులు, సేవలపై ఖర్చు తగ్గిపోతున్నది.

2. తగ్గుతున్న వ్యయం ఫలితంగా సిబ్బంది నియామకాలను కుదిస్తున్నారు. అది సేవలు అందించడంలో జాప్యానికి, లోటుపాట్లకు కారణమౌతున్నది.

ఉదాహరణకు గాంధీ ఆసుపత్రిలో ఇంజనీరింగ్ విద్యార్థి మరణం విషయమే చూద్దాం.

ప్రమాదానికి గురై వచ్చిన మనిషికి జరగవలసిన చికిత్స ఏ ఒక్క విభాగమో, ఒక డాక్టరో చేసేది కాదు. మత్తుమందు ఇచ్చే డాక్టర్, శరీరంలో వివిధ భాగాలకు జరిగిన నష్టాన్ని పరిశీలించగలిగిన నిపుణులు, వాటిని గుర్తించే పరికరాలు, రక్తంతో సహా వివిధ మందులు, ఇతర అవసరాలు అందుబాటులో వుండి, క్షణాలలో జరగవలసిన చికిత్స చేపట్టవలసిన తరుణం. సమష్టిగా, సామూహికంగా జరుగవలసిన ఈ కార్యక్రమంలో ఏ ఒక్కటి లోపించినా, చికిత్స ఫలప్రదం కాదు. అలాగే ప్రమాద సమయానికి, ఆసుపత్రికి చేరిన సమయానికి మధ్య వుండే వ్యవధి గూడ ఒక నిర్ణయాత్మక కారణమౌతుంది.

ఇవేవీ తెలియని రోగి బంధువులు, ఆత్మీయులు ప్రతి మరణానికి డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమనుకుంటారు. వైద్యపులోతుపాతులు తెలియకుండానే, సాంకేతిక పరిజ్ఞానంలేని విలేకరి, న్యూస్ ఎడిటర్ మరణానికి కారణం డాక్టర్ల నిర్లక్ష్యంగా తీర్పులు ప్రకటిస్తున్నారు.

ఇలాంటి మరణాలకు ఎక్కువ అవకాశాలు వున్న కేసులలో ప్రైవేట్ ఆసుపత్రులు చికిత్సకే పూనుకోరు (డంపింగ్). గతంలో ఇవి మెడికోలీగల్ కేసులనే పేర తప్పించుకునేవారు. వైద్య సేవలకు ఇది

అవరోధం కారాదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన తరువాత, చికిత్సకు తమ వద్ద తగిన వసతులు లేవనే సాకుతో ప్రాథమిక చికిత్స మాత్రం చేసి చేతులు దులుపుకుంటున్నారు. ప్రభుత్వాసుపత్రులు తమ బాధ్యతనుండి తప్పించుకోలేవు. అక్కడే నష్టాలు జరుగుతాయి. ప్రభుత్వ ఆసుపత్రులు నిరసన, నిందలు ఎదుర్కొన వలసి వస్తున్నది. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే సిబ్బంది ప్రజా వేశపు ఫలితాలను ఎదుర్కొనవలసిన ప్రమాదంలో పడుతున్నారు.

ఇది వైద్య సిబ్బందికి రక్షణ కల్పించే సమస్యగా కుదింపబడింది. ఆసుపత్రిలో పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటుతో పరిష్కారమౌతుందనే అభిప్రాయం కలిగిస్తున్నారు.

రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. నగరాలు, పట్టణాలు పెరిగి పోతున్నాయి. విస్తరిస్తున్నాయి. విస్తరించిన ఈ ప్రాంతాలకు ప్రభుత్వ రవాణా అవసరాల మేరకు విస్తరించడం లేదు. సిటీ సర్వీసులు నష్టదాయకంగా భావించడం ఇందుకు ఒక కారణం. ఫలితంగా ప్రైవేట్ వాహనాల సంఖ్య అపరిమితంగా పెరుగుతున్నది. ప్రమాదానికి ఎక్కువ ఆస్కారం వుండే టూవీలర్లను మధ్యతరగతి ప్రజల ఆశ్రయించక తప్పని పరిస్థితులు కలిగిస్తున్నారు. ఖర్చులు తగ్గించుకునేందుకు నలుగురు గూడ వీటిపై ప్రయాణం సాగిస్తున్నారు. అతి వేగంగా పోవడం తమ తయారీ వాహనం ప్రత్యేకతగా చూపుతూ వాహన తయారీదారులు కొనుగోలుదార్లను ఆకర్షిస్తున్నారు. వేగంగా పోవడం "హీరోయిజం" గా భావించే యువతరాన్ని ఆవిర్భవింప జేస్తున్నారు. వాహనాల సంఖ్యకు తగినన్ని రోడ్లు వేయడం ఒక అసాధ్యమైన పని. ఫలితం రద్దీలు. రద్దీలతో కోల్పోయిన సమయాన్ని వేగంతో పూడ్చుకోవాలనే తపన.

ప్రభుత్వ రవాణా ఉత్పత్తి క్షీణతలో, సొంత వాహనం భరించలేని వారు భరించగలిగితే ఆటో, లేకుంటే, సెవన్ సీటర్‌ను ఆశ్రయించక తప్పడం లేదు.

ఆటోమొబైల్ ఉత్పత్తి రంగం విస్తరిస్తున్న రంగాలలో మొదటిది. కాని ఈ ఉత్పత్తిలో సాముదాయక రవాణాకు వుపయోగించే హెవీ వెహికల్ ఉత్పత్తి పెరగడం లేదు, ద్విచక్రవాహనాల దార్లు, రవాణా బరువును పెంచే గూడ్స్ వెహికల్స్ ఉత్పత్తి పెరుగుతోంది.

పడవలంత కార్లు రోడ్లను ఆక్రమిస్తున్నాయి. 40 మందిని మోసే సిటి బస్ ఆక్రమించిన రోడ్ స్థలం, ఒక్క సంపన్నుడు ప్రయాణం చేసే కారు ఆక్రమిస్తున్నది.

అమ్మకాలు, లాభాల కోసం అప్పులిచ్చి ఈ కొనుగోళ్ళను తయారీ దారులు పెంచుతున్నారు. ఆదాయపు పన్నులలో కారు కొనుగోలుకు రాయితీలు ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. రుణ మేళాలు ఏర్పాటు చేసి ఆర్థిక సంస్థలు ప్రోత్సహిస్తున్నాయి.

ఇదంతా నగరాలను, పట్టణాలను రవాణా అరణ్యాలుగా మారుస్తున్నాయి. పాద చారులకు నడిచే దారిలేని పరిస్థితులు కలిగిస్తున్నాయి. రోడ్‌లో నడవడమంటే, వాహనం నడపడమంటే, నడిచినా, వాహనం ఎక్కినా ఒకచోట నుండి మరొక చోటుకు పోవడం ప్రమాదాన్ని ఆహ్వానించడంగా తయారైంది.

ఇక రహదారుల సంగతి చూద్దాం. ప్రైవేట్ రోడ్ రవాణా పెరిగింది. రైల్వేలను అధిగమించింది. లాభాల వేటలో ఒక్కొక్క వాహనం చేరవేసే సరుకు బరువు రోజురోజుకు పెరుగుతోంది. వాహన వినియోగం పెంచుకునేందుకు ప్రయాణ సమయం మీద యజమాని కంట్రోలు పెరిగింది. సెల్ ఫోనులలో ఈ అజమాయిషీ మరింత బిగిసింది. పెరిగిన రవాణా, రోడ్ రవాణాలో పెరిగిన బరువుకు తగు విధంగా రోడ్లు వేస్తున్నామని ప్రపంచబ్యాంకు నుండి డాలర్లు తెచ్చి రోడ్లలో పరుస్తున్నారు. ఆయిల్ దిగుమతులు పెంచుతున్నారు. అవి దేశ ఆర్థిక వ్యవస్థనే తల్లక్రిందులు చేస్తున్నాయి. కారిడార్లు నిర్మించి, టోల్‌గేట్లు తెరచి వాహనపు ఖర్చులు పెంచుతున్నారు. రోడ్లు బాగుపడ్డాయి గనుక ప్రయాణ సమయం తగ్గాలని యజమానులు శాసించి ప్రయాణాన్ని వేగవంతం చేస్తున్నారు. మనిషి శక్తి, అలసట, విశ్రాంతి అవసరాలకు మించి పనిలో నైపుణ్యం ఆశిస్తున్నారు.

దీనితో ప్రమాదాలు పెరిగిపోతున్నాయి వైద్య సదుపాయాలు లోపిస్తున్నాయి. ప్రమాదాలకు గురైన ప్రతి ఐదు కేసులలో ఒకటి మరణానికి దారితీస్తున్నది. వీటి నివారణకు మొబైల్ పోలీస్ స్క్వాడ్ల ఏర్పాటు ప్రభుత్వం చూపే పరిష్కారం, హెల్మెట్లు ధరించమని సలహాలు.

అదే సమయంలో వైద్య సదుపాయాలలో కుదింపు. ఇది ప్రభుత్వ ప్రైవేటీకరణ ఫలితం. ఈ అసలు కారణాలను ప్రభుత్వం దాచిపెడుతున్నది.

వైద్యసేవల పట్ల వ్యక్తమయ్యే నిరసన కేవలం ప్రభుత్వ రంగంలోని సూపర్ స్పెషాలిటీస్ ఆసుపత్రులకే పరిమితం కాదు. కింది స్థాయివరకు వుంది. ప్రభుత్వ ఆసుపత్రుల సేవపట్ల అసంతృప్తి వ్యక్తం చేసే ప్రజలే, ప్రభుత్వ ఆసుపత్రుల మూసివేతనూ అంగీకరించడం లేదు. ప్రభుత్వరంగంలో వైద్య సేవలు అవసరమని ప్రజలు భావిస్తున్నారనేందుకు ఇది గుర్తు. రాష్ట్ర వ్యాపితంగా జనవిజ్ఞాన వేదిక గతంలో నిర్వహించిన స్థానిక చర్చలలో వచ్చిన నిర్ణయ సారాంశం ఇది.

విషం తాగి ఆత్మహత్యకు పూనుకున్న వ్యక్తి గాని, ప్రమాదవశాత్తు

ఒళ్ళుకాలిన వ్యక్తిగాని, కాన్పుకు వచ్చిన మహిళ విషయంలో గాని, కలరాతో ఆసుపత్రి చేరినా, పసివాడికి ఫిట్స్ వచ్చినా, పేషంట్ బంధువుల మానసిక స్థితి ఆతృతతో, తమ రోగి బతకాలనే ఆశతోనే వుంటారు.

ఇలాంటి సమయాలలో ప్రమాదానికీ, రోగి ఆసుపత్రికి చేరిన సమయానికీ గల వ్యవధి, చికిత్సకు అవసరమైన మందులు, పరికరాలు అందుబాటులో వుండడం, సిబ్బంది లభ్యత, జాగ్రత్తలు అన్నీ పాత్ర వహిస్తాయి.

ఇందులో రెండున్నర కారణాలు ప్రభుత్వ విధానాలతో ముడిపడి వుండగా, చివరిది మాత్రం మానవ వైఫల్యం కూడా కారణం కావచ్చు.

ఆతృత, సిబ్బంది ఏర్పడే అనేక సందర్భాలలో రోడ్ ప్రమాదాల విషయం వివరంగా పేర్కొన్నాం. రవాణా పెరిగే కొద్దీ ప్రమాదాల సంఖ్య, వేగం, రద్దీతో వాటి దామాషా, పెరుగుతున్నాయి. ఈ ప్రమాదాలలో 20 శాతం మరణాలు నమోదవుతున్నాయి. అదే సందర్భంలో గాంధీ ఆసుపత్రి ఘటన జరిగింది.

ఇతర ప్రమాదాల విషయం కూడా ఇలా వచ్చిన మార్పును ఎవరికి వారు అవగాహన చేసుకొనేందుకు, కార్యకారణ సంబంధాల విశ్లేషణకు తోడ్పడుతుందనే ఆశ.

వైద్యరంగం ప్రైవేటీకరణ వైద్యంతో సంబంధంగల వివిధ రంగాలను ఏ విధంగా ప్రభావితం చేస్తున్నదో చూద్దాం. పైన పేర్కొన్నట్లు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారతప్రభుత్వం ఈ రంగాన్ని అన్ని కోణాల నుండి పరిశీలించిన అనంతరం ప్రభుత్వరంగం కీలక పాత్ర వహించాలని భావించింది. ఆనాటికి వున్న పేటెంట్ చట్టాలు విజ్ఞానాన్ని వ్యాపార సరుకుగా తయారు చేయలేదు. అందువల్ల పరిశోధన, విద్యావకాశాల ఏర్పాటు, మందులలో బల్క్‌డ్రగ్స్ ఉత్పత్తి, పరికరాల ఉత్పత్తి, వైద్య సేవలలో ప్రధాన భాగం, రోగనివారణ వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే వుండేది.

అయితే ప్రైవేట్‌రంగంలో మందుల తయారీని గాని, వైద్య సేవలను గాని నిరోధించలేదు. మరొకరకంగా పరిశీలిస్తే బల్క్ డ్రగ్ ఉత్పత్తులను ఉత్పత్తి ధరకన్నా తక్కువకు అందించే సామాజిక బాధ్యతను ప్రభుత్వ రంగంలోని ఐ.డి.పి.ఎల్. నెత్తిన, చిల్లరగా ఉత్పత్తి చేసే అవకాశం, లాభాలు సంపాదించుకునే అవకాశం ప్రైవేట్ రంగానికి ఇచ్చారు. కాని ధరలను నియంత్రించే అధికారం ప్రభుత్వం చేతిలో వుండింది. ఫలితంగా అంతర్జాతీయ ధరలతో పోలిస్తే చౌకగా మందులు దొరికే దేశాలలో భారతదేశం ఒకటిగా వుండేది. ఎన్ని పరిమితులు వున్నా వైద్య సేవ ఒక హక్కుగా పోరాడిన చోట సాధించుకోగల అవకాశం వుండేది.

"వైద్య సేవలు అందించడం ప్రభుత్వ విధి" అనే ఆలోచన నుండి 1980ల తరువాత క్రమేపి ప్రభుత్వం వెనక్కు తగ్గడం ప్రారంభించి, 1991 నూతన ఆర్థిక విధానాల అమలుతో "వైద్య సేవలలో ప్రైవేట్ రంగానికి పాత్ర" అని సమాన హోదా కలిగించారు.

రోగ నిర్ధారణలో వచ్చిన సాంకేతిక మార్పులు, వచ్చిన కొత్త మందులు వాడుకోవాలనే ఉన్నత వర్గాల ఆశకు ప్రతిబింబంలా 1980 మార్పులు రాగా, అంతర్జాతీయ ద్రవ్య సంస్థ వత్తిడి ఫలితంగా 1991 మార్పులు ఏర్పడ్డాయి. ప్రభుత్వ పన్నుల విధానంలో మార్పు ఫలితంగా ప్రభుత్వ బడ్జెట్లు తలక్రిందులైనాయి. బడ్జెట్‌లో మొత్తం మీద లోటును నియంత్రించాలనే షరతు సామాజిక సంక్షేమ కార్యకలాపాలకు ప్రభుత్వ కేటాయింపులు తగ్గించింది. ఇందులో భాగంగా పరిశోధనా రంగమూ దెబ్బతిన్నది. పేటెంట్ ఒప్పందంతో కుదేలు పడింది. ఆనాటికి అంతర్జాతీయ వాణిజ్యం బహుళజాతి సంస్థల కబంధ హస్తాలలో ఇరుక్కొని కేంద్రీకృతమైంది. ప్రైవేటీకరణ ఊపు అందుకుంది.

పరిశోధనలో బహుళజాతి సంస్థల ప్రభావం ప్రజాజీవితంపై ఎలాంటి ప్రభావం కలిగిస్తుందో రెండు ఉదాహరణలు చూద్దాం.

ప్రపంచాన్ని విపరీతంగా ఆవరించింది ఎయిడ్స్ జాడ్యం. దాని ఉపశమనం మందులు బహుళ జాతి సంస్థలు తయారు చేసి ధరలు చుక్కల్లో నిర్ణయించాయి. ఈ వ్యాధి దక్షిణాఫ్రికాలో చాల ఎక్కువగా వుంది. మందుల ధర సామాన్యులకే గాదు. ప్రభుత్వం సహితం భరించగల స్థితి లేదు. ప్రభుత్వం చేతులెత్తేసింది. ఈ బహుళజాతి కంపెనీల విధానాలకు వ్యతిరేకంగా ఆ దేశంలో ప్రజా ఉద్యమం సాగింది. ప్రపంచ ప్రజల సానుభూతి చూరగొన్నది. ఫలితంగా ఎయిడ్స్ వ్యాధి ఉపశమనం మందుల ధర తగ్గించక తప్పలేదు. ఈలోగా భారతదేశంతో సహా మరికొన్ని దేశాలు గూడ మందుల ఉత్పత్తి ప్రారంభించాయి. బహుళజాతి సంస్థలతో పోలిస్తే చౌకగా అందించగలమని ముందుకొచ్చాయి. కాని ప్రధానంగా పశ్చిమ దేశాలలో వుండే "ఫండింగ్ సంస్థలు" ఈ మందులు కొనేందుకు నిధులు ఇవ్వనిరాకరించాయి. ప్రజాఉద్యమ వత్తిడితో ఐక్యరాజ్యసమితి, ప్రపంచ ఆరోగ్య సంస్థ చౌకగా లభ్యమయ్యే చోట మందులు కొనుక్కునే అధికారం ఆయా ప్రభుత్వాలదని తేల్చాయి.

ఇలాంటిదే ఇన్‌సులిన్ సమస్య. మధుమేహ వ్యాధికి ఎన్ని మందులు వున్నా, అవి ఇన్‌సులిన్‌తో సమానం కావు. భారతదేశ జనాభాలో 10 శాతం ఈ వ్యాధి గ్రస్తులని అంచనా. గతంలో ఇన్‌సులిన్ జంతుజాలం నుండి ఉత్పత్తి చేసేవారు. ఈ మధ్య కాలంలో రసాయనాలతో కృత్రిమ రసాయనంగా ఇన్‌సులిన్

తయారుచేయడం కనుక్కున్నారు. ఈ పరిశోధన సహితం బహుళజాతి చేతిలో వుంది. వారు ధరను నక్షత్ర మండలంలో పెట్టారు. మరొక ప్రాసెస్ ద్వారా అభివృద్ధి చెందిన దేశాలలో ఇన్సులిన్ ఉత్పత్తికి అవకాశాలు ఏర్పడ్డాయి. చౌకగా లభ్యం కాగల వరప్రసాదిఔతాయి ఈ అవకాశాలు.

భారత ప్రభుత్వ రంగ పరిశోధనా సంస్థలలో ఈ పరిశోధనకు అన్ని వనరులూ వున్నాయి. లేనిది నిధులే. ప్రభుత్వం ఈ నిధులను సమకూర్చి, మూతపడి వున్న ఐ.డి.పి.ఎల్ ఆస్తులను వినియోగంలోకి తెచ్చి ఈ మందు ఉత్పత్తి చేసి పంచితే, వ్యాధిగ్రస్తులూ లాభపడ్తారు. ఒక మూత పడిన పరిశ్రమ కళకళలాడుతుంది. భరించగలవారైనా ఈ మందు దిగుమతి చేసుకోవడం ప్రారంభిస్తే అవసరమయ్యే విదేశీ మారకంతో వచ్చే ఇబ్బందులూ, వ్యయము కన్నా ప్రభుత్వం పరిశోధనకు పెట్టే పెట్టుబడి తక్కువ ఔతుంది.

ఇలా బహుళజాతి సంస్థలతో పోటీ పడగల రంగాలను సహితం ప్రభుత్వం విస్మరించి, రోగగ్రస్తులను వారి లాభతృష్ణకు బలిచేస్తున్నది.

పరిశోధనా రంగాన్ని ప్రైవేట్ లాభాల వేటలో వున్న ప్రైవేట్ రంగంతో చేతులు కలిపి, డబ్బు సంపాదించుకొని బతకండని శాసిస్తున్నది.

వైద్యరంగంలో ప్రభుత్వం చేపట్టిన అత్యంత కిరాతక చర్య ఐ.డి.పి.ఎల్.ను వ్యాధిగ్రస్తం చేయడం. వేలాది కుటుంబాలను వీధిపాలు చేయడమే కాదు. బల్క్‌డ్రగ్స్ ఉత్పత్తిలో ప్రైవేట్‌రంగ ప్రవేశానికి, మొత్తం మందుల ధరల పెరుగుదలకు, ఆ విధంగా వ్యాధిగ్రస్తులను రుణగ్రస్తులను చేసే ప్రక్రియకు నాంది పలికింది.

వైద్య సేవలలో సేవాతత్పరతతో ప్రైవేట్ భాగస్వామ్యం ఈ దేశానికి కొత్తకాదు. అయితే అది ఒక వృత్తి మాత్రమే.

అయితే వైద్య సేవలలో కార్పొరేట్ రంగం ప్రవేశించడంతో వైద్య సేవా రంగం ప్రజల పట్ల శాపంగా మారిందంటే అతిశయోక్తి కాదు. ఈ మార్పుతో ఆధునిక రోగ నిర్ధారణ పరికరాలను ఉత్పత్తి చేసే బహుళజాతి సంస్థలు; మందుల ఉత్పత్తి దారులకు, వ్యక్తిగతంగా వైద్యం చేసుకునే ఆర్.యం.పి ల వంటి వైద్యులకు ఈ కార్పొరేట్ యాజమాన్యాలకు అత్యంత అనారోగ్యకరమైన సంబంధాలు ఏర్పడ్డాయి. ఈ సంబంధాలు ఆరోగ్య రంగాన్ని శాసించేక్రమం పెరుగుతోంది. అనుచితమైన ధోరణులు ప్రబలి, బలిసిపోతున్నాయి.

ప్రైవేట్ కార్పొరేట్ రంగం సొంత చొరవతో, సొంత నిధులతో పెరగలేదు. ప్రభుత్వంలో "పలుకుబడి" కొనుక్కొని ఎదిగింది.

భూములు చౌకగా ఇచ్చారు.

యంత్రాల దిగుమతికి పన్నులు మినహాయించారు.

వాటి అభివృద్ధికి ప్రభుత్వ నిధులతో వైద్యం చేయించుకునే హక్కు గల వ్యక్తుల వైద్యాన్ని, ప్రభుత్వ రంగం సూపర్ స్పెషాలిటీస్ నుండి ఈ కార్పొరేట్ సంస్థలకు రెఫర్ చేసి వైద్య వ్యాపారాన్ని లాభదాయకం చేస్తున్నారు. ఇ.ఐ.సి., ఎల్.ఐ.సి., బ్యాంకులు వంటివి గూడ ఇలాగే ఈ రంగాన్ని పెంచి పోషిస్తున్నాయి.

కార్పొరేట్ ఆసుపత్రుల ఏర్పాటుకు ప్రభుత్వ రంగ ద్రవ్యసంస్థలు ఉదారంగా నిధులు సమకూరుస్తున్నాయి.

ఆధునిక సమాచార మాధ్యమాలను వాడుకొని ప్రజలలో "రోగభయం" పెంచుతున్నాయి. రాబోయే రోగాలకు ఇన్సూరెన్స్ పేరిట ఈ నాటి నుండే వాయిదాల పద్ధతిలో ఫీజులు వసూలు చేస్తున్నారు.

రోగభయంతో పాటు తమ గడప తొక్కితే చాలు వ్యాధి మటుమాయం అనే భ్రమలు పోటీపడి ప్రచారం చేస్తున్నాయి.

ఆసుపత్రులలో అత్యధిక పెట్టుబడులతో ఏర్పర్చిన ఆధునిక రోగ నిర్ధారణా యంత్రాలు లాభదాయకంగా నిరంతరం ఉపయోగించే విధంగా అనవసరమైన పరీక్షలు రాసే విధంగా డాక్టర్లను ప్రోత్సహిస్తున్నారు. అలా పరీక్షలు రాసే డాక్టర్ల ప్రతిఫలం గూడ రోగి మీద వేసి "బిల్లులు" చేసి వైద్య ఖర్చులు పెంచేస్తున్నారు. ప్రజల నిత్య జీవిత వ్యయంలో వైద్య ఖర్చుల భాగం రోజురోజుకు పెరుగుతున్నది.

మందుల ఉత్పత్తి దారులకు కార్పొరేట్లకు ఏర్పడిన అనుబంధం ప్రజలను కొల్లగొడుతున్నది. అనవసరమందులతో, నిరుపయోగమైన టానిక్‌లతో మందుల బిల్లులు పెంచుతున్నారు. ఇలా పెంచే డాక్టర్లకు బహుమతులిచ్చి సత్కరిస్తున్నారు. ప్రజా జీవితాన్ని రుణగ్రస్తం చేస్తున్న మొదటి పిశాచి వరకట్నం, రెండవది వైద్యం.

తమకు రోగ నిర్ధారణకు కేసులు అప్పగించే డాక్టర్లకు కమీషన్లు ఇచ్చి, అదీ పేషంట్ల వద్ద వసూలు చేసే బిల్లులో కలిపేస్తున్నారు.

అనవసరమైన భయాలు పెంచి శస్త్ర చికిత్సల పేరుతో తమ ఆపరేషన్ల థియేటర్లకు రద్దీ సృష్టించుకుంటున్నారు. ఆపరేషన్ బిల్లులు పెంచుతున్నారు.

ఇప్పుడిక టెలిమెడిసిన్ పేర లేబరేటరీ సౌకర్యాలను బహుళజాతి సంస్థల గుప్పెట్లో చేర్చే ప్రమాదం ముంచుకొస్తున్నది. రాన్‌బాక్సీ వంటి కంపెనీలు బొంబాయిలో ఇలాంటి లేబరేటరీ ఏర్పాటు చేస్తున్నాయి.

కొద్దిపాటి జాగ్రత్తలతో కొన్ని ఆసుపత్రులు గతంలో బ్లడ్

బ్యాంక్‌లు ఏర్పర్చగలిగేవి. బ్లడ్ బ్యాంక్‌ల నాణ్యత పేర ప్రభుత్వం రూపొందించిన విధి విధానాలవల్ల సాధారణ ఆసుపత్రులు "బ్లడ్ బ్యాంక్" లను ఏర్పర్చలేవు. రెడ్ క్రాస్ వంటి సంస్థలకు గూడ ఇవి తలకు మించిన భారం అవుతున్నాయి. రక్తం ధర పెరిగింది. బ్లడ్ బ్యాంకులు కేంద్రీకృతమౌతున్నాయి.

ఇలాంటి నిబంధనలు ల్యాబ్‌లు గూడ అమలు జరిపితే భవిష్యత్‌లో రోగులకు రాన్ బాక్సీ లేబరేటరీ పరీక్షలే దిక్కౌతాయి.

ఇప్పటికే వైద్య సేవలకు నోచుకోని అనేక సెక్షన్ల ప్రజలువున్నారు. ఇలాంటి వైద్య నిరాకరణకు మధ్య తరగతి ప్రజలు గూడ గురయ్యే కాలం ఎంతో దూరంలో లేదు.

సరిగా ఈ సమయంలోనే వైద్య విద్యారంగంలో సహితం ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్నది ప్రభుత్వం.

ప్రైవేట్‌రంగం తగిన అర్హతలు గల బోధనా సిబ్బంది లేకుండానే, విద్యార్థులకు అవసరమైన పూర్తి స్థాయి ఆసుపత్రి, లైబ్రరీ వంటి వసతులు లేకుండానే లక్షల కొద్దీ ఫీజులు వసూలు చేసి మెడికల్ సీట్లు "వేలం" వేస్తున్నాయి. ఈ అక్రమాలను కొన్ని పత్రికలు బహిర్గతం చేశాయి. వైద్య కళాశాలల అర్హతలను పరీక్షించి అనుమతించవలసిన మెడికల్ కౌన్సిల్ ప్రైవేట్ కళాశాలల విషయంలో "చూచీ చూడనట్లు" వ్యవహరించిన తీరు బహిర్గతం కావడంతో నిద్రలేచిన కౌన్సిల్ ఇన్‌స్పెక్షన్ల సమయంలో అద్దెబోధనా సిబ్బంది, కూలి రోగులను చూపాయి ఈ కళాశాలలు. ఇవీ బహిర్గతం కావడంతో అర్హతలు గల ప్రభుత్వరంగ కళాశాలలో పనిచేసే సిబ్బందికి "ఇబ్బడి ముబ్బడి" జీతాలు ఇచ్చి బోధనా సిబ్బందిని ప్రభుత్వరంగం నుండి "కొల్లగొడుతున్నారు." ప్రభుత్వ కళాశాలలు కౌన్సిల్ శల్య పరీక్షలలో నెగ్గుకరాలేక మూలపడే స్థితి వచ్చింది. ఇది గూడ ప్రైవేట్ కళాశాలలకు "వరం" గా పరిణమిస్తున్నది. ఈ కళాశాలలు వున్న అన్ని వనరులతో ప్రైవేట్ పరం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

ఫీజుల మోతతో అర్హులైన అనేకమంది విద్యార్థులు వైద్య డిగ్రీలు కొనుక్కోలేక వీధులకు ఎక్కుతున్నారు. కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. కోర్టుల తీర్పులు ఉపశమనాలే తప్ప సమస్యకు పరిష్కారం చూపడం లేదు. ఫీజుల దోపిడీని నిలవరించలేక పోతున్నాయి.

వీటిని భరించి డిగ్రీలు పొందే విద్యార్థి, డాక్టర్‌గా ఖర్చులు వడ్డీతో సహా రాబట్టుకొనే వ్యాపారిగా ఆలోచించి వైద్య రంగాన్ని సేవారంగంగా ఎలా చూడగలడు? రోగిని పిండడం ఎలా అని ఆలోచిస్తాడు తప్ప, రోగం నయం చేయడం గురించి ఆలోచిస్తాడా? రోగిని పూర్తిగా స్వస్థుడిని చేస్తే, నిరంతర ఖాతాదారు పట్టీ నుండి తొలగిపోతాడు గదా?

వైద్య రంగం ప్రైవేటీకరణ రోగుల పట్ల ఆక్టోపస్‌లాగా అన్ని వైపుల నుండి పీల్చి పిప్పి చేస్తున్నది. అత్యధిక ప్రజలను నిజమైన వైద్యం నుండి తరిమి కొట్టి మంత్ర తంత్రాలకు, తాయత్తులకు నెడుతున్నది.

ఇదంతా ప్రభుత్వం నిధుల లేమితో అనివార్యమై చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నది. ఈ రంగానికి కావలసిన పెట్టుబడిని ప్రైవేట్‌రంగం సమకూరుస్తున్నట్లు ప్రచారం చేస్తున్నది.

ఇవి ఏ మాత్రం నిజం కాదు.

ప్రభుత్వం సంపన్నులకు పన్నులలో, ప్రభుత్వ వ్యయంలో రాయితీలు ఇచ్చి ఖజానాకు రావలసిన నిధులను ఉద్దేశ్యపూర్వకంగా కోల్పోతున్నది. అయినా నిష్పత్తిగా గాక మొత్తాలుగా (అబ్‌సొల్యూట్) చూస్తే వేలాది కోట్లు నిధులు జమ అవుతూనే వున్నాయి. ఆ నిధులలో సంక్షేమానికి కేటాయించే శాతం తరిగి పోతోంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఈ రంగానికి కేటాయించిన నిధులలో మందులకు, ఇతర వైద్య అవసరాలకు లభించే మొత్తం తరిగిపోతోంది.

రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో పన్నుల శాతం తగ్గింది. అయినా ఆదాయాలు మొత్తాలుగా పెరిగాయి.

వైద్య కళాశాలల ప్రైవేట్‌రంగాన్నుండి రూ.1362 కోట్లు వచ్చాయని గత ప్రభుత్వం ప్రచారం చేసింది. ఈ మొత్తంలో అత్యధిక భాగం ప్రభుత్వ రంగ ద్రవ్య సంస్థలు సమకూర్చిందే. ప్రైవేట్ "ఖర్చులు" గాక నిజమైన పెట్టుబడులకు మించే ప్రభుత్వ రాయితీలు అర్పణ చేసింది.

వైద్యరంగంలో ప్రైవేటీకరణ పేద ప్రజలకు వైద్య హక్కును నిరాకరించడమే. ఆరోగ్య రంగంలో ప్రభుత్వం వెనుకపట్టు పట్టడంతో మలేరియా, టి.బి. వంటి అంటు వ్యాధులు తిరిగి విజృంభిస్తున్నాయి. అలాంటి సమయంలో వైద్యరంగం ప్రైవేటీకరించడం ప్రజల నెత్తిన పిడుగులు కురిపించడమే.

ప్రజా పంపిణీని అస్తవ్యస్తం చేసి తిండి, నీరు అమ్మకానికి పెట్టి ప్రైవేటీకరణతో చదువు, వైద్యం కరువు చేసి సాధారణ ప్రజలకు బతికే హక్కునే హరించే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడి ప్రకృతి పరమైన జీవితాన్ని నిలబెట్టుకుందాం.

]

మళ్లా ప్రపంచబ్యాంకు ఊబిలోకి...

-వి. హనుమంతరావు

పిడుక్కు బియ్యానికి ఒకే మంత్రం అనేది సామెత. ప్రపంచబ్యాంకు వ్యవహారశైలి చూస్తుంటే పై సామెత గుర్తుకు వస్తుంది. అది ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా- ఏ ప్రాంతమైనా కానివ్వండి, ఆ ప్రాంతాల్లో ఏదేశమైనా కానివ్వండి, అది అతి పేదదేశమైనా కావచ్చు, లేదా వర్ధమానదేశమైనా కావచ్చు, వివిధ సంప్రదాయాలు, కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు ఉన్నా సరే, ఆదేశం ఆర్థిక పరిస్థితికి రోగం వచ్చి, సహాయం అడిగితే, అందరికీ ఇచ్చే మందు ఒక్కటే. మీరు వృద్ధులయితే, మీ చిన్నపుడు ఎపుడైనా అప్పటి లోకల్ ఫండ్ ఆసుపత్రికి వెళ్లితే 'ఎర్రనీళ్లు' మందు ఇవ్వటం గుర్తుండే వుంటుంది (కార్మినిటివ్ మిక్చర్). అన్ని రోగాలకూ అదే మందు. సబ్సిడీలు ఉపసంహరించాలి. ఉద్యోగాల సంఖ్యను తగ్గించాలి; పెన్షన్ల బరువును దించుకోవాలి; ప్రభుత్వరంగ సంస్థలను మూసేయాలి లేదా ప్రయివేటు రంగానికి దఖలు పరచాలి; ముఖ్యంగా విద్యుచ్ఛక్తి రంగాన్ని ప్రయివేటీకరించాలి; విదేశీ పరిశ్రమలకు, విదేశీ నిధులకు తలుపులు బార్లా తెరవాలి-ఇలా సాగుతూంది దండకం. కాస్త కుడి ఎడమగా ఇదేపాట. ఆయాదేశాల్లో ఈ మందు వికటిస్తే, కొన్ని విషయాల్లో ఒకడుగు వెనక్కు వేస్తుంది తప్ప, రూటు మార్చదు.

జనవరి 18న సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) సంస్థలో ప్రపంచబ్యాంకు ప్రతినిధులు హాజరైన ఒక చర్చా సమావేశంలో "స్టేట్ ఫిస్కల్ రిఫార్మ్స్ ఇన్ ఇండియా" పేరుతో విడుదల చేసిన ప్రపంచబ్యాంకు నివేదిక అధ్యయనం చేసినపుడు ఎపుడో 1991 నాటి బ్యాంక్ నివేదిక చదువుతున్న అభిప్రాయం కలిగింది. 14 సంవత్సరాల క్రితం బ్యాంక్ పత్రంలో సరిగ్గా ఇవే సూచనలున్నాయి. ఆ సూచనలనే మళ్లా ఈ తాజా నివేదిక ప్రతిపాదిస్తున్నదంటే ఆ మందు పని చెయ్యక పోయి వుండాలి; లేదా ఆ మందును ఉపయోగించకుండా వుండి వుండాలి. ఏమైనా అది బ్యాంకు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ఫలితమే. చంద్రబాబు ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోవటం ఆ విషయాన్ని రుజువు చేస్తుంది కూడా.

ఆంధ్రప్రదేశ్‌కు వస్తే...

1995-95లో సంస్కరణలు అమలు పరచిన తర్వాత రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని మన నిత్యానుభవం. రుణభారం నాలుగు రెట్లు పెరిగింది. నిరుద్యోగం పెరిగింది. పంట తగ్గింది; ఉత్పాదకత తగ్గింది. పరిశ్రమలకు వల్లకాడుగా మారింది. ఈ పరిణామాన్ని అధ్యయనం చేసిన సెస్ అధ్యక్షులు డా.సి.హెచ్. హనుమంతరావు, డైరెక్టర్ ప్రొఫెసర్ మహేంద్రదేవ్ "రాష్ట్ర స్థూలాదాయం పెరిగిన స్పష్టమైన దాఖలాలు లేవు", "తలసరి ఆదాయం ఎపుడూ తలసరి జిడిపి కన్నా తక్కువగా వుంటూ రావడమే కాక వాటి మధ్య అంతరం పెరిగింది", "సేవల రంగంలో కూడా పెరుగుదల అఖిలభారత స్థాయికన్నా చాలా తక్కువగానే వుంది", "అస్తులు 80వ దశకంలో ఆరుశాతం నుంచి 90వ దశకంలో 36 శాతానికి పడిపోయాయి" అన్నారు. సెస్ ప్రచురించిన పుస్తకంలో పరిశోధన ఫలితాలు ఇలాంటివెన్నోన్నో వున్నాయి. ప్రపంచబ్యాంకు నిధులతో ప్రారంభించిన 'వెలుగు' పథకం చేసిన సర్వే ప్రకారం రాష్ట్రంలో 79.08 లక్షల కుటుంబాలు దారిద్ర్య రేఖ క్రింద బతుకులు వెళ్లదీస్తున్నాయి. వారిలో 52.33 లక్షల కుటుంబాలు పేదకుటుంబాలైతే, 25.70 లక్షలు నిరుపేద కుటుంబాలున్నాయి. సంస్కరణలు అనుకొన్న ఫలితాలను ఇవ్వలేదనటానికి ఇలాంటి ఉదాహరణాలెన్నయినా ఇవ్వవచ్చు-

పైన ఉదహరించిన బ్యాంక్ నివేదికలో కొన్ని సూచనలు ఎలాంటివంటే దానికి ప్రపంచబ్యాంక్ నిపుణుల తెలివి తేటలు అవసరం లేదు. ఖర్చు తగ్గించాలి, ఆదాయం పెంచాలి, లంచగొండితనాన్ని అరికట్టాలి, పన్నుల ఎగవేతను కఠినంగా కంట్రోల్ చెయ్యాలి, పన్నుల వసూళ్లు పకడ్బందిగా జరగటం లేదు- ఇలాంటి సూచనలివ్వడానికి బ్యాంక్ అవసరం లేదు. దేశంలో ఆర్థిక శాస్త్రవేత్తలు చెవినిల్లుకట్టుకొని ఈ సూచనలను ఎప్పటి నుంచో ఇస్తున్నారు. పన్ను-జిడిపి నిష్పత్తి పెంచాలి. కాని ఎలా పెరుగుతుంది? అభివృద్ధి చెందిన దేశాలు కేంద్ర ప్రభుత్వాన్ని మొట్టికాయలు మొట్టి, కస్టమ్స్, ఎక్సయిజు సుంకాల ఆదాయాన్ని తగ్గించేలా చేశారు. సహజంగానే నిష్పత్తి తగ్గుతుంది.

ప్రపంచబ్యాంకు నుంచి షరతులతో రుణాలు తీసుకోవడంపై విరామం లేకుండా విమర్శలు కురిపించిన అప్పటి ప్రతిపక్షనాయకుడు డా.రాజశేఖరరెడ్డి అధికారంలోకి రావటంతోనే అలా రుణాలు తీసుకోవటాన్ని సమర్థిస్తూ ప్రకటనలు చేయటం అత్యంత విచారకరం. ఇలా రుణం తీసుకోవటాన్ని గత ప్రభుత్వం ఏ వాదనలతో సమర్థించుకొంటూ వచ్చిందో, అవే వాదనలు చేస్తున్నారు ముఖ్యమంత్రి. రుణాలు తీసుకోకుండా ప్రత్యామ్నాయ వనరుల సేకరణకు కసరత్తు ప్రారంభించి, కొన్ని విజయాలు సాధించి కూడా మళ్లా ఆ ప్రపంచ బ్యాంకు వద్దకే వెళ్లటం గత ప్రభుత్వ విధానాన్ని అనుసరించడమే అవుతుంది. ఈ పంథా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయటం మాట అటుంచి రాష్ట్రాన్ని మరింత రుణాల ఊబిలో ముంచడానికి, ప్రజల జీవితాలను మరింత దుర్భరం చేయడానికే దారి తీస్తుంది. అన్నిటి కన్నా ముఖ్యం ప్రజలిచ్చిన తీర్పుకు ఇది

వ్యతిరేకం. ప్రపంచంలో అనేక దేశాలు ఇలాగే ప్రపంచబ్యాంకు వలలో చిక్కుకొని, శ్లేష్మంలోపడ్డ ఈగలా గిలగిలా కొట్టుకొంటున్నాయి.

ముఖ్యమంత్రి పదవి స్వీకరించటంతోనే మొదటిసారి ఢిల్లీవెళ్ళినపుడు ప్రపంచబ్యాంకు ప్రతినిధితో కలిసినపుడే పట్టణాభివృద్ధికి రుణం ఇస్తానని బ్యాంకు వాగ్దానం చేయటం రాష్ట్రాన్ని తన పట్టులో వుంచుకోవడానికి విసిరిన వల. ఉచిత విద్యుత్ నిర్ణయంపట్ల తమ అసంతృప్తిని వెలిబుచ్చుతూనే, రెండోపక్క కొత్త రుణం ఇస్తాననటం ప్రపంచబ్యాంకు వ్యూహాత్మకంగా ముందడుగు వేస్తున్న వైనాన్ని తెలియచేస్తుంది. తాజాగా ప్రపంచబ్యాంకు బృందం రాష్ట్రంలో పర్యటనకు, అధికారులతో, ముఖ్యమంత్రితో చర్చించటానికి వచ్చింది. 'భారత్ దేశంలో రాష్ట్రాల ద్రవ్యసంస్కరణలు' అనే బ్యాంకు నివేదికను విడుదల చేయడానికి హైదరాబాద్ నగరాన్నే ఎంపిక చేసింది. ప్రపంచబ్యాంకు ఆర్థిక సహాయంకోసం మొగ్గుచూపిస్తున్న ముఖ్యమంత్రిని పద్మవ్యూహంలోకి లాగడానికి, ఆయన ఆలోచనలను ప్రభావితం చేయడానికి ఇది మరో ప్రయత్నం.

ఇటువంటి వ్యూహం, ఎత్తుగడలు వేయటం ప్రపంచబ్యాంకుకు కొత్త విషయమేమీ కాదు. 1997-98లో కొన్ని ఆసియా దేశాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోగా, ప్రపంచబ్యాంకు తోకముడిచి పారిపోకుండా, మళ్లీ రుణం ఇచ్చి, ఆ దేశాలను తన ఆర్థిక గుప్పెట్లో వుంచుకోవటం పాఠకులకు గుర్తుండే వుంటుంది. ప్రపంచంలో అనేక దేశాలు ప్రపంచబ్యాంకు-ఐ.ఎం.ఎఫ్-డబ్ల్యుటివోల ఉచ్చులో పడి తలకిందులవుతూంటే ఆ సంస్థలు పైశాచికానందం అనుభవిస్తున్నాయి. ముఖ్యమంత్రి రెడీ రిఫరెన్స్‌కోసం రెండు మూడు దేశాల అనుభవాలను ఇక్కడ ఇస్తున్నా.

మెక్సికో

ప్రపంచంలో మెక్సికో తొమ్మిదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగల దేశం. అయినా 45 శాతంమంది రైతులు ఉండనా ఊడనా అన్న పరిస్థితుల్లో వ్యవసాయాన్ని కొనసాగిస్తూ వచ్చారు. 1982లో దేశాన్ని బాలన్స్ ఆఫ్ పేమెంట్సు, కరెన్సీ సంక్షోభం చుట్టుముట్టగా ఐఎంఎఫ్ సహాయం చేస్తానంటూ దేశంలో కాలుపెట్టింది. మన రాష్ట్రంలో ప్రపంచబ్యాంకు వ్యవస్థాగత సర్దుబాటురుణం ఇచ్చినట్లే ఆ దేశానికి కూడా అలాగే రుణం ఇచ్చి, మెక్సికో ఆర్థిక వ్యవస్థను తలకిందులు చేసింది. స్వయంపోషకత్వం వైపు పయనించడానికి ప్రయత్నిస్తున్న దేశాన్ని ఎగుమతుల ఆధారిత దేశంగా మార్చివేసింది. తిండిగింజలను పండించే రైతులను వ్యాపార, ఆహారేతర పంటలవైపు ఎంతగా మళ్లించిందంటే అమెరికాకు మెక్సికో నుంచి వ్యవసాయోత్పత్తుల ఎగుమతుల విలువ 1981లో 1482 బిలియన్ డాలర్ల నుంచి 2001లో 3903 బిలియన్ డాలర్లకు పెరిగింది. అదే సమయంలో అమెరికా నుంచి మెక్సికోకు ఆహారధాన్యాల దిగుమతులు 2001 నాటికి 40 శాతం మేరకు పెరిగాయి. అమెరికాలో పశువులకు మేపే మొక్కజొన్నను మెక్సికో ప్రజలు తినడానికి పంపించారు. 1989లో ఆ దేశ వ్యవసాయ మంత్రిత్వశాఖ ప్రకటన ప్రకారం పనిచేసే శక్తి, సత్తువ వున్న వారిలో 54 శాతంమంది దారిద్ర్య రేఖకు దిగువన వున్నారు. వీరిశాతం 1998 నాటికి 64కు పెరిగింది. గ్రామీణ నిరుద్యోగాన్ని తట్టుకోలేక పట్టణాలకు వలసలు ప్రారంభమయ్యాయి. 80 శాతం గ్రామీణ కుటుంబాల్లో నుంచి ప్రతీ ఒక్క కుటుంబం నుంచి ఒక్కొక్కరు గ్రామాల నుంచి బయటకు వలసపోవటం జరిగింది. అమెరికానుంచి పెట్టుబడుల వరద పెరిగి 2000 నాటికి 11.7 బిలియన్ డాలర్లకు చేరుకొన్నాయి. ఏతావాతా జరిగిందేమంటే ఆ దేశ ఆహార అవసరాల్లో 40 శాతం అమెరికా నుంచే దిగుమతి అవుతున్నాయి. సహజంగానే ఆ దేశం బడ్జెట్ లోటు 2001 నాటికి 4.1 బిలియన్ డాలర్లకు దూసుకపోయింది.

సగటున అమెరికాలో కార్మికునికి ఇచ్చే జీతంలో మెక్సికో కార్మికుని జీతం 20 శాతం మాత్రమే ఉండడంతో కార్గిల్, మోన్‌సాంటో లాంటి బహుళజాతి సంస్థలు మెక్సికోను ఈ చివరనుంచి ఆ చివరవరకూ దున్నేశాయి.

బ్రెజిల్

ప్రపంచంలో కెల్లా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో బ్రెజిల్ 10వ స్థానంలో వుంది. కాఫీ, పంచదార ముఖ్య ఎగుమతులు. కేవలం 20 శాతంమంది గ్రామాల్లో నివసిస్తారు. మొత్తం పంటభూమిలో ఒక్కశాతం భూమి 40 శాతం రైతులకు జీవనాధారం. కేవలం 20 శాతంమందిగా వున్న ధనిక రైతుల చేతుల్లో 88 శాతం భూమి వుంది. అసమానతలు అంత తీవ్రంగా వున్నాయన్న మాట. ఈ అసమానతలు ఉద్యమాలకు దారితీసాయి. ఎంఎస్టీ (భూకార్మికుల ఉద్యమం) నాయకత్వం కింద మూడున్నర లక్షల భూమిలేని పేదలు కోటిన్నర హెక్టార్ల భూమిని ఆక్రమించుకొన్నారు. బ్రెజిల్‌లో బడా భూస్వాముల కింద వేలహెక్టార్ల భూఖండాలున్నాయి. ఇవన్నీ బీడుపడి వున్నాయి. ఇలాంటి నేపథ్యం వున్న దేశం రుణాల ఊబిలో పడడం ఆశ్చర్యమేమీ లేదు. 80వ దశకంలో ఈ దేశం ఆర్థిక సంక్షోభంలో పడడం, ఐఎంఎఫ్ దేశంలో అడుగు పెట్టడం, దాని ఫార్ములా అమలు పరచటం జరిగిపోయాయి. రైతుల పంటల ధరలు 50 నుంచి 64 శాతం మేరకు పడిపోయాయి. 1995లో ప్రపంచ వ్యాపారసంస్థలోకి ఈడ్చబడింది. ఇటు దిగుమతుల మీద డ్యూటీలు, అటు ఎగుమతుల మీద సబ్సిడీలు 13 నుంచి 24 శాతం తగ్గించబడ్డాయి. ఎగుమతులు పెరిగాయి కాని, కాఫీ, పంచదార ధరలు ఎన్నడూ లేనంతగా పడిపోయాయి. బియ్యం, మొక్కజొన్న, గోధుమ, పాల ఉత్పత్తుల దిగుమతులు పెరిగాయి. బ్రెజిల్‌లోకి వచ్చే దిగునుతుల్లో ఇవే 80 శాతం వుంటాయి; వాటిదిగుమతుల బిల్లు మూడుశాతం నుంచి 13 శాతానికి పెరిగింది. వ్యవసాయ కూలీలు వలస పోవటం వల్ల గ్రామాల్లో వ్యవసాయ కూలీల శాతం 37 నుంచి 17 శాతానికి పడిపోయింది. తలసరి తిండిగింజల లభ్యత గత దశాబ్దకాలంలో తగ్గిపోయింది. అటు ఐఎంఎఫ్, ఇటు డబ్ల్యుటివో ఆ దేశంలో కాలు

పెట్టిన వేళా విశేషం అలాంటిది.

ఆఫ్రికా

అపారమైన సహజసంపద అంటే ఆఫ్రికా దేశాల తర్వాతే మరేదేశం పేరేదైనా చెప్పాలి. కాని ఈ అపార సంపదే ఆఫ్రికన్ ప్రజల శాపమై కూర్చొంది. సామ్రాజ్యవాదుల రూపంలో పెట్టుబడిదారీ విధానం ఈ దేశాల్లో అడుగు పెట్టింది. సామ్రాజ్యవాద దేశాలు కుక్కల్లా కాట్లాడుకొని ఎవడికి అందింది వాడు కొల్లగొట్టుక పోయారు. ఆఫ్రికన్లను బానిసలుగా పని చేయించుకోవడానికి తమ తమ దేశాలకు తోలుక పోయారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఈ దేశాలకు నామమాత్రం స్వాతంత్ర్యం లభించింది. అయినా ప్రపంచంలో పేదల్లో (రోజుకు డాలర్‌కన్నా తక్కువ ఆదాయం) నిరుపేదలు 40 శాతం మంది ఆఫ్రికా దేశాల్లో, ముఖ్యంగా సబ్-సహారన్ ఆఫ్రికాలో వున్నారు; ప్రపంచంలోని ఎయిడ్స్‌వ్యాధి సోకిన వారిలో సగం మంది కూడా ఈ దేశాల్లో వున్నారు. చదువురాని వయోజనుల సంఖ్య సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్‌లో 67 శాతం, జాంబియాలో 64 శాతం, నైజర్‌లో 61 శాతం, ఇతర దేశాల్లో సుమారుగా అదే శాతంలో వున్నారు. ప్రజలు ఓపికపట్టినన్నాళ్లు ఈ పేదరికాన్ని భరించారు. ఆ దేశాల నాయకులు లాగోస్‌లో సమావేశమై ఈ దారిద్ర్యాన్ని, ఆకలిని అంతం చేయాలని పథకం రచించారు. ఎక్కడ దారిద్ర్యం వుంటే, అక్కడ ప్రవేశించి పేదరికం తొలగింపుకు సహాయం చేస్తానని చెప్పి నెత్తిన టోపీ పెట్టడం ప్రపంచబ్యాంకుకు వెన్నతో పెట్టిన విద్య. మేము సహాయం చేస్తాం, మీకు తిండిగింజలు మేమిస్తాం అంటూ ఆ దేశాల్లోని వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి ఎగుమతి చేసే విధానాన్ని ప్రవేశపెట్టారు. మీ దేశాల్లో నీటి కొరత వుంది కాబట్టి మీ వ్యవసాయం లాభసాటి కాదు, మేము నీటిని మీ దేశానికి ఎగుమతి చేస్తాం, అంటే ఏ నీటితో మీరు పంటలు పండిస్తారో, ఆ పంటలనే మీ దేశాలకు పంపిస్తాం అన్నారు. ఉన్నకాస్త నీటిని ఎగుమతి చేసే పంటలు పండించడానికి ఉపయోగించమన్నారు. ఆ దేశాల్లోని సంపన్న పాలకవర్గాలు ప్రపంచబ్యాంకు బుట్టలో పడ్డారు. ఆ తర్వాత కథ షరా మామూలే. ఆ దేశాల రుణభారం స్థూల జాతీయాదాయంలో 1980లో 21 శాతం వుంటే కేవలం ఎనిమిదేళ్ళలో 85 శాతానికి పెరిగిపోయింది. వడ్డీభారం ఎగుమతుల్లో శాతంగా తొమ్మిది నుంచి 25 శాతానికి పెరిగింది. ప్రపంచ ఆహారసంస్థ 2003లో లక్షలాదిమంది ఆకలికేకలకు స్పందించాలంటే లక్షలాది టన్నుల ఆహార ధాన్యాలను ఈ దేశాలు దిగుమతి చేసుకోవాల్సి వుంటుందని చెప్పింది. అపారమైన సహజవనరులున్న దేశాలు తిండిగింజలను దిగుమతి చేసుకోవాల్సిన దుర్గతికి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల సహాయం నెట్టింది. ఒకపక్క ఈ దేశాల్లో ఆకలికేకలు వినిపిస్తుంటే రెండోపక్క సెనెగల్, ఛాద్, నైజర్, మాలి దేశాలనుంచి ఒకటిన్నర బిలియన్ డాలర్ల వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి చేసింది. ఈ దిగుమతుల విలువ ఎగుమతుల విలువ కన్నా మూడురెట్లు! ఎగుమతి చేసిన వ్యవసాయ ఉత్పత్తులను, తిండిగింజల పంటలస్థానే పండించాలని విదేశీ సహాయసంస్థలు బలవంతం చేసాయి. ఇలా ఎగుమతుల ద్వారా సంపాదించిన విదేశీ మారకాన్ని ఈ దేశాల పాలకులు విలాసాలకోసం ఖర్చు చేసుకొన్నారు. అమెరికాలో పత్తిరైతులకు పెద్ద ఎత్తున సబ్సిడీలివ్వటంతో, వారి పత్తిని చాలా తక్కువ ధరకు విదేశాల్లో అమ్మటం వల్ల, సహేలీ పత్తి రైతులు ప్రతిఏటా 260 మిలియన్ డాలర్లు నష్టపోతున్నారు. ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలా ఒకటి కాదు, రెండు కాదు, 70 దేశాలు ప్రపంచబ్యాంకు పదఘట్టనల కింద నలిగిపోతున్నాయి. కోట్లాది ప్రజలు నష్టపోతున్నారు. ఇదెంత నష్టమో స్వయంగా రాజశేఖరరెడ్డే శాసనసభలో, బయటా ప్రతిపక్ష నాయకునిగా మాట్లాడిన సందర్భాలున్నాయి.

నిజమే, రాష్ట్రం నిధుల ఇబ్బందుల నెదుర్కొంటూంది. ఇది ఇవాళా నిన్నా కొత్తగా ఏర్పడిన పరిస్థితి కాదు. నిధుల కొరతను తీర్చడానికి మనసుంటే మార్గం వుంటుంది. రాష్ట్రంలో ప్రజా సంఘాలు, రైతు సంఘాలు చాలా సందర్భాల్లో అనేక సూచనలు చేస్తూ వచ్చాయి. మేధావులు, ఆర్థిక శాస్త్రవేత్తలు కూడా సలహాలిస్తూ వచ్చారు. ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక దుస్థితి (ఇది గత ప్రభుత్వ పుణ్యం) గురించి ఒక శ్వేత పత్రాన్ని విడుదల చేసి (ఇందులో ప్రపంచబ్యాంకుతో ఇదివరకు చేసుకొన్న ఒప్పందాల షరతులు, వడ్డీ భారాలు, ఎంత గ్రాంటు, ఎంత రుణం వగైరా వివరాలు కూడా వుండాలి) సంస్థలు, రాజకీయ పార్టీలు, విశ్వవిద్యాలయాలు, మేధావులు, ఆర్థిక శాస్త్రవేత్తల నుంచి సామాన్యుల మీద భారం పడకుండా ఎటువంటి కొత్త వనరులు సేకరించవచ్చునో సలహాలు కోరవచ్చు. ఈ బాధ్యతను ఏదైనా ప్రభుత్వేతర పరిశోధనా సంస్థకు అప్పగించవచ్చు. జయతిఘోష్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వ్యవసాయదారుల సంక్షేమ కమీషన్ చేసిన సూచనలను పరిశీలించి అమలు చేయవచ్చు. అంతవరకూ ప్రపంచబ్యాంకుతో షరతులతో కూడిన ఒప్పందాలు చేసుకోవటాన్ని నిలుపుదల చేయాలి. ఏదేశం నుంచయినా, ఏసంస్థ నుంచయినా రుణాలు తీసుకోవచ్చు కాని మొదట దేశంలో, బ్యాంకుల్లో మూలుగుతున్న నిధులను సేకరించే విధానం గురించి ఆలోచించాలి. నీటిపారుదల ప్రాజెక్టులు ఏజిల్లాలో, మండలాలకు లాభసాటిగా వుంటాయో, ఏ రైతులు లాభపడతారో, వారిలో సంపన్నుల నుంచి పెట్టుబడులు సేకరించవచ్చు. ఈ అవకాశాలన్నీ వినియోగించుకున్న తర్వాతనే, అన్ని రాజకీయ పక్షాల సంప్రదింపుల అనంతరమే ప్రపంచబ్యాంకు నుంచి షరతులులేని రుణం తీసుకోవటం గురించి ఆలోచించవచ్చు.]

వ్యవసాయోత్పత్తుల ముందస్తువాణిజ్యం ఎవరికి లాభిస్తుంది?

-అరిబండి ప్రసాదరావు

ప్రపంచీకరణ నేపథ్యంలో మన వ్యవసాయరంగంలో వచ్చిన సంక్షోభాన్ని ఎదుర్కొనడానికి, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ, మన ఉత్పత్తులను ప్రపంచపోటీని ఎదుర్కునేందుకు దీటుగా రూపొందించడానికి, వ్యవసాయరంగ కార్పోరేటీకరణ తప్పదని, మార్కెటింగ్ వ్యవస్థను ఆధునీకరించాలని, దానిలోభాగంగా వ్యవసాయోత్పత్తుల 'ముందస్తు వాణిజ్యం' (ఫ్యూచర్ ట్రేడింగ్) అవసరమని ఇప్పుడు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ వాణిజ్యంద్వారా ఏ వస్తువుకు మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందో ముందుగానే తెలుసుకొని ఆ పంటనే వేయటం ద్వారా రైతులు ఆదాయం పెంచుకోవచ్చని, మార్కెట్‌లో వస్తువుల ధరను ముందుగానే కనుగొనవచ్చని కూడా ప్రచారం జరుగుతోంది. ప్రజలకు సంబంధించిన అన్ని సమస్యలను 'మార్కెటే' పరిష్కరిస్తుందని, మార్కెట్‌లను రెగ్యులేట్ చేయకుండా కేవలం ఫెసిలిటేటర్‌గా ప్రభుత్వం ఉండాలనే సిద్ధాంత ప్రాతిపదికగా నడిచే ప్రపంచీకరణ విధానాలకు 'కట్టుబడి' ప్రభుత్వం పని చేస్తున్న రోజులివి. ముందస్తు వాణిజ్యాన్ని అన్ని స్టాక్ ఎక్స్‌చేంజిల ద్వారా ప్రారంభించి క్రమంగా అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు విస్తరిస్తున్న రోజులివి. ఈ నేపథ్యంలో ఈ వాణిజ్యం సామాన్యులపై కలిగించే ప్రభావాన్ని విశ్లేషించి, ఎవరికి ప్రధానంగా దీనివల్ల లాభం కలుగుతుందని అంచనా వేయటం ఈ వ్యాస లక్ష్యం.

ముందస్తు వాణిజ్యం, ముందస్తు అమ్మకాలు ఒకటే కావు

మామూలు వ్యాపారంలో 'వస్తువు' భౌతికంగా అమ్మకందారుని నుండి కొనుగోలు దారునికి మారుతుంది. ప్రతిగా, కొనుగోలుదారు అమ్మకందారునకు అంగీకరించిన రేటును రూపాయల్లో చెల్లిస్తాడు. అయితే, ముందస్తు అమ్మకం, వాణిజ్యంలలో చేతులు మారాల్సిన 'వస్తువు' అమ్మి, కొనే సమయంలోనే భౌతికంగా ఉండాల్సిన అవసరం లేదు. ముందస్తు అమ్మకంలో పేదరైతులు పంటకోసిన తర్వాత ఇస్తానని షావుకారుకు హామీఇచ్చి ఆయన ఇచ్చిన రేటుకు సామాన్యంగా తమ పంటను ముందుగానే అమ్ముతారు. ఈ రేటు సామాన్యంగా పంటకోసి అమ్మేకాలంలో ఉండే మార్కెట్‌ధరకన్నా చాలా తక్కువగా ఉంటుంది.

ఇదేవిధంగా, కాంట్రాక్టు సేద్యంలో మామూలుగా ముందుగానే కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం కంపెనీ సేద్యానికి అవసరమైన పెట్టుబళ్ళను(విత్తనాలతోసహా) రైతుకు సమకూరుస్తుంది. ప్రతిగా, వచ్చిన ఉత్పత్తిని రైతు కంపెనీ నిర్ణయించిన రేటుకు అమ్మాలి. కుదుర్చుకున్న రేటు, అమ్మే సమయంలో మార్కెట్‌రేట్లలో తేడా ఎక్కువగా ఉన్నపుడు, అమ్మకం-కొనుగోళ్ళలో వచ్చే సమస్యలను పక్కనపెడితే, ఇది ఇంకోవిధమైన 'ముందస్తు అమ్మకం'. ఈ రెంటిలో అమ్మకం, కొనుగోలుదారుల మధ్య వస్తుమార్పిడి అనివార్యంగా ఉంటుంది.

ఇక మూడవరకం 'ముందస్తు కాంట్రాక్టు అమ్మకం' ప్రధానంగా టోకు వ్యాపారస్తులు లేదా కాంట్రాక్టుసేద్యం చేసే కంపెనీలు ఇతర పెద్ద కంపెనీలతో కుదుర్చుకొనే ఒప్పందం. దీనిలో ఉభయులు అంగీకరించిన ధరకు సరుకును నిర్దేశించిన గడువుకు ఇచ్చేలా ముందస్తు ఒప్పందాలు జరుగుతాయి. ఈ ఒప్పందపు కాగితాలను అమ్మి, కొనవచ్చు. ఇవి ముందస్తు కాంట్రాక్టు అమ్మకాలు (ఫార్వర్డ్ కాంట్రాక్ట్ ట్రేడింగ్). ఈ ముందస్తు అమ్మకాలన్నింటిలో అమ్మకం, కొనుగోలుదారుల మధ్య వస్తుమార్పిడి అనివార్యంగా ఉంటుంది. దీనివల్ల మార్కెట్‌లో రైతులు తమ పంటలను అమ్ముకోగలరు. ఇవి వినిమయదారులకు అంతిమంగా చేరుతాయి. ఇది మామూలుగా మనకు తెలిసిన వ్యాపారం.

దీనికి భిన్నంగా, ముందస్తు వాణిజ్యంలో అమ్మకం కొనుగోలుదారుల మధ్య వస్తుమార్పిడి తప్పనిసరిగా జరగాల్సిన నియమం లేదు. ఇది నామమాత్రమేనని ఇప్పటివరకు ఉన్న అనుభవాలు తెలుపుతున్నాయి. ఉదాహరణకు, అమెరికా కమాడిటీ ఫ్యూచర్‌ట్రేడింగ్ కమిషన్ చికాగో ఎక్స్‌చేంజిలో 1000 మొక్కజొన్న ఫ్యూచర్స్ ఒప్పందాలలో, కేవలం మూడు ఎగ్రిమెంటులు 2000-01లో అంతిమంగా సెటిల్మెంటుకు వచ్చాయని 2001 సంవత్సరం వార్షికనివేదిక తెలుపుతోంది. ఇదేవిధంగా, గోధుమలలో కేవలం 8.6 అగ్రిమెంట్లు సెటిల్మెంటులకు వచ్చాయట. ఇలా అంతిమంగా సెటిలైన అగ్రిమెంట్లలో అధికభాగం అమ్మకం-కొనుగోలుదారుల మధ్య వస్తుమార్పిడి రూపేణా కాకుండా కేవలం డబ్బురూపేణా అయ్యిందట.

ఇక మనదేశంలో నమ్మతగిన గణాంకాలు అందుబాటులో లేవు. అంతిమంగా, సెటిల్మెంటుకు వచ్చిన అగ్రిమెంట్లు 5శాతం కన్నా తక్కువని అంచనాగా వచ్చిన వార్తలు సూచిస్తున్నాయి. వాస్తవంలో, ఇలా 1 - 2 శాతం అగ్రిమెంట్లు మాత్రమే ఫైనల్ సెటిల్మెంట్‌కు

రావచ్చు. వీటిలో, ఎన్ని అగ్రిమెంట్లు వస్తుమార్పిడి రూపంలో, డబ్బురూపేణా అయినవో వివరాలు అందుబాటులో లేవు. ఈ వివరాలన్నీ ముందస్తు వాణిజ్యం కేవలం పేపరు లెక్కలకే పరిమితమని, అమ్మకం - కొనుగోలుదారుల మధ్య వస్తుమార్పిడి నామమాత్రమని తెలియజేస్తున్నాయి. దీనినే మరోరూపంలో చెప్పాలంటే, వ్యవసాయోత్పత్తికి, రైతులకు సంబంధంలేని వ్యాపారం ముందస్తువాణిజ్యం.

ముందస్తువాణిజ్యం - చారిత్రకనేపథ్యం

చారిత్రకంగా చూసినట్లయితే, ముందస్తు వాణిజ్యం అమెరికాలో ముందస్తు కాంట్రాక్టు అమ్మకాలు, కొనుగోళ్ళ ఒప్పందాల నుండి రూపాంతరం చెందింది. ముందస్తు అమ్మకాల కాంట్రాక్టులు, ఆ తరువాత కొనుగోళ్ళు లేదా అమ్మకందారులు తప్పుకోవడానికి వీలులేకుండా వుండేవి. ఒకవేళ ఏ పార్టీ తప్పుకున్నా, కాంట్రాక్టు ఉల్లంఘన చర్యలను ఎదుర్కొవాల్సి వచ్చేది. ఫలితంగా స్పెక్యులేటర్లు లాభాలు తీసుకోవడానికి ఈ ముందస్తు అమ్మకాల ఒప్పంద పత్రాలను చవకగా ఉన్నప్పుడే కొనుక్కొని, ధర పెరిగిన తర్వాత లాభాలకు అమ్ముకునేవారు. అయితే ఈ అగ్రిమెంట్ల వెనుక వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు, కొనుగోళ్ళు జరిగేవి. అగ్రిమెంట్ల ద్వారా మార్పిడి జరగబోయే వస్తుపరిమాణాన్ని అమ్మకం, కొనుగోలుదారులు ముందుగానే నిర్ణయించేవారు. ఇదేగాక, వాణిజ్యసరుకు పరిమాణం అన్ని అగ్రిమెంట్లలో ఒకేవిధంగా ఉండేదికారు. అగ్రిమెంటు గడువు తీరిన వెంటనే 'వస్తువు' అమ్మకాలు, కొనుగోళ్ళు తప్పనిసరిగా జరిగేవి. చివరికి, ఈ అగ్రిమెంట్ల అమలుకై అమ్మకం, కొనుగోలుదారులు జాగ్రత్తగా ముందుచూపుతో వ్యవహరించాల్సి వచ్చేది. ఈ బెడదలేవీలేకుండా, అమ్మకం, పరిమాణం, నాణ్యత, అగ్రిమెంటు అమలు గడువులను స్థిరంగా నిర్దేశిస్తూ, కేవలం ధరలోనే మార్పు ఉండేవిధంగా కాంట్రాక్టులను కాగితాలకే పరిమితం చేసి స్టాకు ఎక్స్‌చేంజిల ద్వారా అమ్మకం కొనుగోళ్ళను ప్రారంభించారు. ఈ అగ్రిమెంటు కాగితాలనే 'ఫ్యూచర్స్' అంటారు. ఈ కాగితాల కొనుగోళ్ళను సృష్టించడానికి సరుకు ఉత్పత్తి అవసరం లేదు. కేవలం అగ్రిమెంటు అంతిమ సెటిల్‌మెంట్ సమయంలోనే సరుకు అవసరం ఏర్పడుతుంది. ఈ అంతిమసెటిల్మెంటు కరెన్సీరూపంలో జరుగవచ్చు. ఇప్పుడు ఎక్కువభాగం ఇలానే జరుగుతున్నాయి. ఏవిధంగా జరిగినప్పటికి ఈ వాణిజ్య కాంట్రాక్టులో చివరకు సెటిల్‌మెంట్‌కు వచ్చేవి ఒక శాతంలోపే ఉంటాయి. అందువల్ల ముందస్తు వాణిజ్యం వస్తుమార్పిడి వాణిజ్యం కాదు. కాగితాలకే పరిమితమయ్యే వాణిజ్యం. మార్కెట్‌రేటు, ముందస్తు వాణిజ్య పత్రంలో ఉన్న రేట్లతేడా (దీనిని బేసిస్‌అంటారు) స్పెక్యులేటర్స్‌కు మార్కెట్‌లో ఉండబోయే 'డిమాండ్' మార్పులను సూచిస్తుంది. ఇదే వారి లాభనష్టాలను నిర్దేశిస్తుంది.

ముందస్తువాణిజ్యంలో రైతుల స్థానం?

ముందస్తువాణిజ్యంలో పెద్దరైతులు కూడా ప్రత్యక్షంగా తమ ఉత్పత్తిని అమ్ముకునే స్థితిలేదు. దీనికి ప్రధాన కారణం అనుభవలేమి, కాంట్రాక్టుకు ఇవ్వవల్సిన కనీస పరిమాణం అధికంగా ఉండడమేగాక, సరుకుఅందివ్వాల్సిన స్థానం చాలా దూరంగా ఉండడమే. ఉదాహరణకు కనీసవాణిజ్య పరిమాణం పత్తి 4 టన్నులు, గోరుచిక్కుడుబంక 5 టన్నులు, పంచదార 50 టన్నులు. ఇలాగే, రైతు పత్తిని పంజాబ్‌లోని భటిండా, గుజరాత్‌లోని అహ్మదాబాద్, ఉత్తరభారతదేశంలోవున్న సిరసా, సురేంద్రనగర్, గుజరాత్‌లోని కాడీ మార్కెట్‌లకు, మంచిశనగను ఢిల్లీ, ఇండోర్ వాణిజ్య కేంద్రాలకు అందించాలి. ఒకవేళ మిరప, పసుపు, మొక్కజొన్నలాంటి ఉత్పత్తులకు గుంటూరు, నిజామాబాద్, కరీంనగర్‌లాంటి పట్టణాలలో వాణిజ్యకేంద్రాలను స్థాపించినా, రాష్ట్రంలోని పెద్దరైతులు కూడా తమ సరుకును ఇంతదూరపు వాణిజ్యకేంద్రాలకు పంపి, సరుకును అందించలేరు. అందువల్ల, దాదాపు రైతులందరూ ముందస్తువాణిజ్యం ద్వారా తమ సరుకును అమ్ముకోవడానికి బ్రోకర్లు, టోకువ్యాపారస్తులమీదే ఆధారపడాల్సి ఉంటుంది. వీరు అప్పటి స్థానిక మార్కెట్ స్థితిగతులమీద ఆధారపడి రేటు నిర్ణయించి రైతులనుండి సరుకుకొంటారుతప్ప, ముందస్తువాణిజ్యంలో తమకు గిట్టిన రేటులో తమ ఖర్చులను తీసుకొని మిగతాసొమ్మును న్యాయబద్ధంగా లెక్కించి రైతులకందిస్తారని భావించడం అత్యాశే అవుతుంది. అందువల్ల, బ్రోకర్ల చేత, బ్రోకర్లలాభంకోసం, బ్రోకర్ల మధ్య నిర్వహించబడేదే ముందస్తువాణిజ్యం. బ్రోకర్లరాజ్యంలో రైతుస్థితి అర్థంచేసుకోవటం మనకు కష్టమేమికాదు.

ముందస్తువాణిజ్యం పనిచేస్తున్నతీరు

ప్రస్తుతం మనదేశంలో ముందస్తువాణిజ్యం మల్టీకమాడిటి ఎక్స్‌చేంజ్ అఫ్ ఇండియా, నేషనల్ కమాడిటి అండ్ డిరైవేటివ్ ఎక్స్‌చేంజ్ లిమిటెడ్, నేషనల్ మల్టీకమాడిటిఎక్స్‌చేంజ్, ఇతర స్టాక్‌మార్కెట్‌లు మొత్తం 26 ఎక్స్‌చేంజ్‌లనుండి ముందస్తువాణిజ్యం జరుగుతున్నా, వీనిలో వ్యాపారం కొన్ని కేంద్రాలలోనే బాగా జరుగుతోంది. ఈ వాణిజ్యం ప్రారంభించిన కొద్ది కాలానికే, అంటే మార్చి, 2003 అంతానికి, దాదాపు రూ. 1.40లక్షల కోట్ల విలువైన ముందస్తువాణిజ్యం జరిగిందని అందుబాటులో ఉన్న లెక్కలు తెలుపుతున్నాయి. అయితే, వీటిపై వ్యాపారస్తులు ఇచ్చే మార్జిన్‌మనీ 5.5 - 8.0శాతం మధ్యవున్నది. అంటే అతికొద్ది పెట్టుబడితో (రూ.6000-7000కోట్లు), ముందస్తువాణిజ్యం ద్వారా రూ. 1.4లక్షలకోట్ల విలువైన వ్యవసాయోత్పత్తుల మార్కెట్‌ను వ్యాపారస్తులు నియంత్రణ చేయగలిగారు. అతిత్వరలో ఈ వాణిజ్యం

రూ. 10లక్షల కోట్లకు పైగా చేరుతుందని వాణిజ్యవర్గాలు అంచనావేస్తున్నాయి. విదేశీసంస్థల పెట్టుబడులను ఈ వాణిజ్యంలోకి అనుమతిస్తే, ఈ వాణిజ్యం వార్షికంగా రూ. 20లక్షలకోట్లకు పైగా ఉండవచ్చని ఈ వాణిజ్యవర్గాలే అంచనావేస్తున్నాయి. స్టాక్ఎక్స్చేంజ్ ధరల్లో జరిగే అవకతవకలు, మానిప్యులేషన్స్, వీనిపై విదేశీపెట్టుబడి సంస్థల వేగంగా పెరుగుతూ, బిగుస్తున్న పట్టు అందరికీ తెలిసిందే. అందువల్ల, ముందస్తువాణిజ్యం అతికొద్ది ఖర్చు, పెట్టుబడితో గుత్తపెట్టుబడిదారులకు, ముఖ్యంగా విదేశీపెట్టుబడిసంస్థలకు, మన వ్యవసాయ బాగోగులు నిర్ణయించేవీలును కలుగజేస్తుంది.

ముందస్తువాణిజ్యం ద్వారా కనుగొన్న 'వస్తువు'ధర రైతుకు లాభిస్తుందా?

ముందస్తువాణిజ్యం ద్వారా వ్యవసాయఉత్పత్తులధరలు ముందుగానే తెలవటంవల్ల, దాని ఆధారంగా ఏ పంటవేయాలో ముందుగానే రైతు నిర్ణయం తీసుకోవచ్చని విస్తృత ప్రచారం చేయబడుతోంది. దీనిలో నిజమెంతో పరిశీలిద్దాం. ఈవాణిజ్యం ద్వారా గుర్తించబడ్డ రేటు 3-4నెలల ముందుగా తెలుస్తుంది. ఈ రేటు వాస్తవమార్కెట్లో టోకువ్యాపారస్తుడు లేదా బ్రోకరు రైతువద్దనుండి సరుకును కొనేటప్పుడు గరిష్టంగా ఎంతవరకు పెట్టికొనవచ్చో అని తెలుపుతుందే కాని, రైతుకి ఇవ్వతగిన కనిష్టరేటును లేదా గిట్టబోయేధరను తెలుపదు. ఈ గరిష్టరేటు రైతుకు ఎట్టిపరిస్థితిలోను అందదు. రైతుకు ఇవ్వగలిగిన గరిష్టరేటును బ్రోకరు లేదా టోకువ్యాపారస్తుడు నిర్ణయించేటప్పుడు, తన ఖర్చులను, లాభాల్ని తీసివేసి మాత్రమే నిర్ణయిస్తాడు. దీన్ని గమనంలో ఉంచుకుని, సరుకును వాస్తవంగా కొనేసమయంలో మార్కెట్లో అమ్మకానికి వచ్చిన సరుకు పరిమాణాన్ని , స్థితిగతులను , అప్పటి అంతర్జాతీయమార్కెట్ పరిస్థితులను, రైతుల బేరమాడేశక్తిని గమనంలో ఉంచుకొని వ్యాపారుస్తుడు(లు) రైతుకు ఇచ్చేరేటును నిర్ణయిస్తాడేతప్ప (ఈ రేటు వాస్తవంలో బ్రోకర్ దృష్టిలో కనిష్టంగా ఉంటుంది), రైతుకు గిట్టుబాటుధర రావాలనో లేదా కనీసమద్దతుధర రావాలనో భావించి రైతు సరుకుకు ధర నిర్ణయించడు. పంటకోతల తరుణంలో సాధ్యమైనంత కనీసరేటుకే రైతుసరుకును వ్యాపారస్తులు కొంటారు తప్ప, ముందస్తువాణిజ్యం ద్వారా కనిపెట్టిన గరిష్టరేటు ఆధారంగా కొనరు. పత్తి, వేరుశనగ, దాదాపు అన్ని వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్లో ఇప్పుడు దీనినే గమనిస్తున్నాం. ధరలపై రైతుల ఆందోళను చూస్తున్నాం. ఇదేగాక, వేయబోయే పంటఎంపిక, కోతలసమయాలలో రేట్లతేడాను ముందస్తువాణిజ్యం ఏమాత్రం సూచించదు. అందువల్ల, ముందస్తువాణిజ్యం ద్వారా గుర్తించిన రేటు ఈ వాణిజ్యంలో పాల్గొనే బ్రోకర్లు, టోకువ్యాపారస్తులు తమమధ్య జరిగే అమ్మకాలు, కొనుగోలులో నిర్ణయం తీసుకోవడానికి తోడ్పడుతుందిగాని, పంటవేసే తరుణంలో ఏపంటను వేయాలనే రైతుల నిర్ణయంలోని రిస్కును ఏమాత్రం తగ్గించదు.

వ్యవసాయోత్పత్తిలో గిట్టుబాటుధరలను రైతుకు అందించటానికి, మార్కెట్లో ప్రభుత్వజోక్యఅవసరాన్ని ముందస్తువాణిజ్యం ఏమాత్రం తగ్గించదు. ఇదేవిధంగా, వ్యవసాయోత్పత్తుల ధరల నిర్ణయసంఘం పనివిధానాన్ని మెరుగుపర్చాల్సిన అవసరాన్ని ముందస్తువాణిజ్యం ఏమాత్రం తగ్గించదు.

ముందస్తువాణిజ్యం సేద్యంలో రైతుల రిస్కును తగ్గించగలదా?

ఈ ప్రశ్నకు ఒక్కమాటలో సమాధానం చెప్పాలంటే, లేదనే చెప్పాలి. ముందస్తువాణిజ్యం, బ్రోకర్లు, టోకువ్యాపారస్తులు, స్పెక్యులేటర్లకు వాణిజ్యంలో ధరలహెచ్చుతగ్గులను తట్టుకోడానికి తోడ్పడుతుందిగాని, సేద్యంలోని ఏఒక్క ఒడిదుడుకును (రిస్కు) తట్టుకోడానికి రైతుకు తోడ్పడదు. సేద్యపురిస్కును తగ్గించడానికి పంటల భీమా అవసరాన్ని ముందస్తువాణిజ్యం ఏమాత్రం తగ్గించదు.

ముందస్తువాణిజ్యం వినియోగదారునికి ఏమైనా లాభం కలుగజేస్తుందా?

ఈ ప్రశ్నకు కూడా ఒక్కమాటలో సమాధానం చెప్పాలంటే, లేదనే చెప్పాలి. సరుకు వినియోగదారునికి చేరేలోపల ఎన్ని చేతులు మారితే, వినియోగదారుని ధర అ వేంర పెరుగుతుంది. ముందస్తువాణిజ్యంలో ప్యూచర్స్ అంతిమంగా సెటిల్మెంట్కు వచ్చేలోపల స్పెక్యులేటర్ల మధ్య ఎన్నోసార్లు చేతులు మారుతుంది. ఇలా మారిన ప్రతిసారి వాణిజ్య నిర్వహణ ఖర్చు వస్తువు ధరను పెంచుతుంది. ముందస్తువాణిజ్యం ద్వారా స్పెక్యులేటర్లు తమ లాభాలను పెంచుకోవటానికి మార్కెట్లో సరుకు అమ్మకాన్ని అతితక్కువ ఖర్చుతో నిల్వచేయగలుగుతారు. అందువల్ల, అంతిమంగా ముందస్తువాణిజ్యం ఉత్పత్తి - వినియోగదారునికి మధ్య దళారీ, బ్రోకర్ల దొంతరలను,స్పెక్యులేషన్ లాభాలను పెంచి వినియోగదారుని మీద భారం పెంచుతుందేతప్ప, తగ్గించదు. ఫలితంగా వినియోగదారునిపై ధరలరూపంలో భారం పెరుగుతుంది.

మరి ముందస్తువాణిజ్యం ఎవరికి లాభాలను తెస్తుంది?

క్లుప్తంగా సమాధానం చెప్పాలంటే ముందస్తువాణిజ్యం వల్ల ప్రధానంగా లాభించేవారు స్పెక్యులేటర్స్, బ్రోకర్లు, వ్యవసాయవాణిజ్యాన్ని నియంత్రించే స్వదేశీ, విదేశీపెట్టుబడిదారులే. వారుపొందే లాభాలను సమకూర్చి నష్టపోయేది సామాన్యభారత ప్రజలు మాత్రమే. స్టాక్మార్కెట్, సెన్సెక్స్ పెరుగుదల దేశ ప్రగతికి చిహ్నంగా ప్రచారం చేసేవారే బ్రోకర్ల, స్పెక్యులేటర్ల ముందస్తు వాణిజ్య లాభాలను వ్యవసాయరంగానికి, రైతులకు వచ్చే లాభాలుగా ప్రచారం చేయటం ఆశ్చర్యం కలిగించదు. సామాన్య ప్రజలు అనుభవంతో వాస్తవం తెలుసుకొంటున్నారు. ఉత్పత్తికి, వస్తుమార్పిడికి, రైతులకు ప్రమేయం లేని ముందస్తు వాణిజ్యం రైతులకు ఏమాత్రం ప్రయోజనం కలిగించదు.

]

అంబానీలైనా-ఆ కథంతే!

-రమణ

కోట్లలో ఆస్తి, అన్నదమ్ముల వారసత్వం, తండ్రిబతికున్నంతకాలం ఇష్టమున్నా లేకున్నా కలిసుండి తర్వాత ఆస్తి పంపకాలకోసం చొక్కాలు పట్టుకోవడం, మధ్యవర్తుల సర్దుబాటు ప్రయత్నాలు, తర్వాత ఆస్తి పంపకాలు- కొన్ని తరాలుగా ఉమ్మడి కుటుంబాల్లో జరుగుతున్న తంతు ఇదే. సినిమాల్లో దీన్ని కథావస్తువుగా వాడుతూ కొన్ని వందల కథలను తెరకెక్కించారు.

అంబానీలైనా అనామకులైనా ఆస్తి విషయంలో అంతా ఒక్కటే. వేలకోట్లలో ఆస్తి ఉంది కాబట్టి అంబానీల కథ పేపర్లకెక్కింది. అయిదెకరాల పొలమో అరతులం బంగారమో ఉంటే అది మామూలు కథే.

అతిమామూలు మనిషిగా జీవితం మొదలు పెట్టి అత్యంత శక్తివంతమైన వ్యాపార సామ్రాజ్యానికి అధిపతిగా ఎదిగిన ధీరూభాయ్ అంబానీ కుటుంబంలోనూ అదే జరిగింది. ధీరూబాయ్‌కి ఇద్దరు కొడుకులు. తండ్రి వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మిస్తున్న రోజుల్లో అన్నదమ్ములు ఇద్దరూ ఆయనకు చేదోడు వాదోడుగా నిలిచారు. అనిల్ చిన్నవాడు, యువకుడు కాబట్టి ఉన్నత విద్యలకు విదేశాలలో ప్రముఖ యూనివర్సిటీల్లో చేరాడు. ఆ సమయంలో పెద్దవాడు ముఖేష్ తండ్రివెంట ఉన్నాడు.

వయసు మీద పడడంతో కార్యకలాపాలను చిన్నగా కొడుకుల చేతికి పగ్గాలను అందచేసే ప్రయత్నాలను ధీరుభాయ్ మొదలు పెట్టాడు. సామ్రాజ్యం విస్తరించిన కారణంగా కొడుకుల సహకారం తీసుకోవడం ధీరుభాయ్‌కి తప్పలేదు. అందరిలాగానే ధీరూభాయ్ మంచాన పడ్డాడు. ఒకనాడు కన్నుమూశాడు. ఆనాటికి ధీరూభాయ్ స్థాపించిన రిలయన్స్ సామ్రాజ్యాల ఆస్తుల విలువ రు.99,000 కోట్లు. ఈ ఆస్తులన్నిట్లోకి ప్రధానమైన ఆస్తి రిలయన్స్ గ్రూప్‌లోని రిలయన్స్ ఇండస్ట్రీస్. గ్రూప్‌లోని అనేక ప్రధాన వ్యాపార కార్యకలాపాలు-గ్యాస్, పాలిస్టర్, వగైరా-ఈ కంపెనీలోనే ఉన్నాయి. విద్యుత్ ఉత్పత్తి పంపిణీ వ్యాపారం చేపట్టిన రిలయన్స్ ఎనర్జీ, టెలిఫోన్ సేవలందించే రిలయన్స్ ఇన్ఫోకామ్ కూడా కాలక్రమేణా బలమైన వ్యాపార సంస్థలుగా ఎదిగాయి. వీటిలో చిన్నవాడైన అనిల్‌కు ప్రధాన పాత్ర ఉండగా, రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో ముఖేష్‌ది కీలకపాత్ర.

గొడవల్లా ఆస్తిలో ఎవరివాటా ఎంత అన్న విషయంలోనే. రిలయన్స్‌లో లక్షల మంది సాధారణ ఇన్వెస్టర్లకూ వాటా ఉంది. అయినా ప్రమోటర్లయిన అంచనాలదే పెద్దవాటా. అయితే అన్ని కంపెనీల్లో లాగా అంచనాలవాటా ఫలానా కంపెనీలో ఇంత అని ఇదమిత్థంగా చెప్పలేనంత సంక్లిష్టంగా ధీరూభాయ్ పెట్టుబడులను సర్దాడు. రిలయన్స్‌లో దాదాపు 200 చిన్న, పెద్ద పెట్టుబడి సంస్థలు డబ్బులు పెట్టాయి. ఈ పెట్టుబడి కంపెనీల్లో కొన్ని అంబానీల స్వంతం కాగా కొన్నిట్లో అంబానీ కుటుంబానికి సాధారణ వాటా మాత్రమే ఉంది.

ధీరూభాయ్ కన్నుమూసే నాటికి ఆస్తులను ఏరకంగానూ పంచలేదు. వీలునామా రాయలేదు. ధీరూభాయ్ ఆస్పత్రిలో ఉండగానే వీలునామాకు సంబంధించిన చర్చ జరిగినా కాగితం మీద పంపకాలేవీ జరగలేదు. చివరకు చట్టపరంగా ధీరూభాయ్ భార్య కోకిలాబెన్‌కు పగ్గాలు వచ్చాయి. అయితే తండ్రి మరణం తర్వాత కొంతకాలం కలిసికట్టుగా వ్యవహారాలను నడిపిన అన్నదమ్ములిద్దరి మధ్య తేడాలు కాలక్రమేణా బయటపడ్డాయి. పగ్గాలను పట్టుకునేందుకు ముఖేష్, అనిల్‌లు ఇద్దరూ నేనంటే నేనని ముందుకొచ్చారు. కోకిలాబెన్ సర్ది చెప్పే ప్రయత్నం చేసినా అన్నదమ్ముల ఆస్తి యుద్ధం రోడ్డున పడ్డది. అంబానీల కుటుంబానికి సన్నిహితులందరూ సర్దిచెప్పే ప్రయత్నం చేసినా చిన్నవాడైన అనిల్ దూకుడుగా ఇమెయిల్ యుద్ధం చేస్తూనే వస్తున్నాడు. ఈ నేపథ్యంలో రిలయన్స్ గ్రూప్‌లోని డైరెక్టర్లూ ఇతర కీలకమైన వ్యక్తులూ రెండు గ్రూప్‌లుగా అనిల్, ముఖేష్‌ల పక్షాన విడిపోయారు.

కుటుంబానికి ఆధ్యాత్మిక మద్దతునిచ్చే గురువు చెప్పినా, పరిశ్రమల్లోని ఇతర పెద్దలు చెప్పినా విననంత దూరంగా అన్నదమ్ములిద్దరూ విడిపోయారు.

కంపెనీల చట్టం, మూలధనంలో వాటాలు వగైరా సాంకేతికాంశాలు పక్కన పెడితే, ఈ ఆస్తి తగాదాకు ధీరూభాయ్ వేసిపోయిన చిక్కుముడులే కారణంగా కనిపిస్తున్నాయి. సామ్రాజ్యాన్ని కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా ధీరూభాయ్ పెట్టుబడులు, వాటాలు, యాజమాన్య అధికారాలను బయటికి వారికి అంత

అవలీలగా అర్థం కానంత సంక్లిష్టంగా తయారుచేసాడు. దీనివల్ల రిలయన్స్ వైపు కన్నెత్తి చూసే ధైర్యం ధీరూభాయ్ బతికుండగానే ఎవరూ చేయలేరు. అయితే అన్నదమ్ములిద్దరూ ఆయన వారసత్వాన్ని దిగ్విజయంగా చేపడతారన్న ధీరూభాయ్ ఆశలు మాత్రం అంతగా నెరవేరలేదనే చెప్పాలి.

దీనికితోడు కోడళ్ల వ్యవహారం కూడా చర్చనీయాంశమైంది. అన్నదమ్ములిద్దరూ ఫక్తు తెలుగు సినిమా అన్నదమ్ముల్లా కలిసుండే ప్రయత్నం చేసినా చదువు, ఆస్తి, అహంకారం ఉన్న కోడళ్లలా ధీరూభాయ్ కోడళ్లు కూడా అన్నదమ్ముల సంధి ప్రయత్నాలకు గండి కొడుతూనే ఉన్నారన్న వార్తలు గిట్టనివాళ్లు ప్రచారం చేస్తూనే ఉన్నారు. భార్యల పోరు పడలేక తెగతెంపులు చేసుకునే దిశలో అన్నదమ్ములు పయనిస్తున్నారన్నది ప్రత్యర్థుల వాదన.

రిలయన్స్‌లో అన్నదమ్ములు విడిపోకుండా ఉంటే జరిగే లాభమేంటి, విడిపోతే నష్టమేంటనేది మాత్రం ఇంతవరకూ చర్చకు రాలేదు. ఇన్వెస్టర్లు వాళ్ళ షేర్ విలువ తగ్గనంతవరకూ, నష్టం రానంత వరకూ అన్నదమ్ములు విడిపోయినా కలిసున్నా పెద్ద తేడా ఏంలేదు.

పెట్టుబడులు ప్రజలనుంచి సేకరించి, కోట్లకు పడగలెత్తి, మిగులును పంపిణీ చేయకుండా ఒక పబ్లిక్ కంపెనీని సొంత ఆస్తిలా పంచుకునే ప్రయత్నం చేస్తున్న అంబానీ కుటుంబాన్ని అంతగా అర్థం చేసుకునే ప్రయత్నం చేయడం, ఆస్తికోసం జట్టూజుట్టు పట్టుకున్న అన్నదమ్ముల గురించి అంత ఆలోచించాల్సిన అవసరం రోజూ రెక్కలు ముక్కలు చేసుకుని సాయంత్రానికి ఆ రోజుకు కావలసిన అవసరాలు తీర్చుకునేందుకు అపసోపాలు పడే సామాన్యునికి ఎందుకు?

]

సామాజిక పరిణామ సూత్రాలు

(సామాజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషణలతో ఎన్నో కొత్త పుస్తకాలు వెలువడుతున్నాయి. వాటి గురించి తెలుసుకునే అవకాశం పాఠకులకు ఏ ఒక్కరికీ సంపూర్ణంగా ఉండడం లేదు. ఈ సంచిక నుంచి ప్రారంభించి వీక్షణం పాఠకులకోసం ప్రత్యేకంగా కొత్తపుస్తకాల పరిచయ శీర్షికను ప్రారంభిస్తున్నాం. మార్కెట్లో వెలువడిన కొత్తపుస్తకం లోంచి ఆసక్తిదాయకరమైన భాగాన్ని గాని, ఆ పుస్తకం గురించి పరిచయ వ్యాసాన్ని గాని ఈ శీర్షిక కింద ప్రచురిస్తాము. ఈ సంచికలో న్యూవిస్టాస్ పబ్లికేషన్స్ ప్రచురించిన 'మార్క్సిస్టుతత్వ శాస్త్రం-ఒక పరిచయం' పుస్తకంలో నుంచి 'చారిత్రక భౌతికవాదం' అధ్యాయంలోని కొన్ని అంశాలు ప్రచురిస్తున్నాము. -సం)

మానవ సమాజం ఎలా అస్తిత్వంలోకి వచ్చింది? అది ఎలా నడుస్తున్నది, అభివృద్ధి చెందుతున్నది? అది ఎటు పయనిస్తున్నది? ప్రాచీన కాలంనుండీ మానవులు ఈ ప్రశ్నలకు సమాధానాల కోసం శోధిస్తూనే వున్నారు. ప్రాచీన కాలంనుండి వర్గ పునాదిపై నిలిచిన సామాజిక ఆర్థిక వ్యవస్థలలో అస్థిపర వర్గాలే బౌద్ధిక రంగాన్ని శాసిస్తూ వచ్చాయి. ఫలితంగా సమాజంపట్లా, సమాజాభివృద్ధిపట్లా, చరిత్రపట్లా భావవాద భావన ఇటీవలి కాలంవరకూ రాజ్యం చేస్తూ వచ్చింది. సమాజానికి దాని అభివృద్ధికి అభౌతికమైన దైవికశక్తే కారణమనే ధోరణీ, మహావీరుల, గొప్పవ్యక్తుల వ్యక్తిగత శక్తిసామర్థ్యాలే చరిత్ర చోదకశక్తులు అని భావించే ధోరణీ, మహనీయుల గొప్ప ఆలోచనలూ భావాలూ బోధలే సమాజాన్ని ముందుకు నడిపిస్తాయనే ధోరణీ-ఇలా భిన్న రూపాలలో సమాజంపట్ల చరిత్రపట్ల భావవాద ధోరణి వ్యక్తమౌతూ వచ్చింది.

చరిత్రపట్ల భౌతికవాద భావన మార్క్సిజంతోనే ప్రారంభమైంది. చరిత్రపట్ల మతవాద, భావవాద, జడతార్కిక భౌతికవాద దృక్పథాలకు భిన్నంగా మార్క్స్, ఎంగెల్స్‌లు మొత్తం మానవ సమాజ చరిత్రను గతితార్కిక భౌతికవాద దృక్పథంతో వ్యాఖ్యానించారు. ఆ క్రమంలో వారు మానవ సమాజాభివృద్ధిని నియంత్రించే సాధారణ మౌలిక నియమాల శాస్త్రంగా చారిత్రక భౌతికవాదాన్ని రూపొందించారు.

"మనం ప్రకృతిలోనే కాదు, సమాజంలో కూడా జీవిస్తున్నాము. సమాజానికి కూడా, ప్రకృతికంటే ఏమాత్రం తక్కువ కాకుండా పరిణామ చరిత్ర, విజ్ఞాన శాస్త్రం వున్నాయి. కనుక సహజ శాస్త్రాన్ని, అనగా చారిత్రక తాత్విక శాస్త్రాలు అనబడే వాటి సమాచారాన్ని భౌతికవాద పునాదితో సమన్వయ పరచి, దానిపై పునర్నిర్మించటం అనేదే సమస్య." (లుడ్విగ్ ఫ్యూయర్‌బా, పే.27)

చారిత్రక భౌతికవాదమంటే, మానవ సమాజానికీ, సమాజాభివృద్ధికీ, చరిత్రకూ వర్తింపజేసిన గతితార్కిక భౌతికవాదమనే అర్థం.

"చారిత్రక భౌతికవాదం అనగా గతితార్కిక భౌతికవాద సూత్రాలను సామాజిక జీవిత అధ్యయనానికి విస్తరింపజేయుట; సామాజిక జీవిత దృగ్విషయాలకూ, సమాజాన్నీ సమాజ చరిత్రనూ అధ్యయనం చేయడానికి గతితార్కిక భౌతికవాద సూత్రాలను అనువర్తింపచేయుట." (స్టాలిన్, బోల్షివిక్ పార్టీ చరిత్ర. పే. 152)

ఇతర విజ్ఞాన శాస్త్రాలకు భిన్నంగా చారిత్రక భౌతికవాదం మొత్తంగా సమాజపు అత్యంత సాధారణ లక్షణాలనూ, సమాజ నిర్మాణాన్ని సామాజిక జీవితంలోని వివిధ అంశాల మధ్య పరస్పర చర్యా ప్రతిచర్యలనూ, సామాజికాభివృద్ధి యొక్క సాధారణ నియమాలనూ చోదకశక్తులనూ అధ్యయనం చేస్తుంది. ఈ సమస్యలనది-గతితార్కిక భౌతికవాద దృక్పథం నుండి పరిశీలిస్తుంది. అంటే అది, సామాజిక జీవితంలోని భౌతికాంశాలకు, బౌద్ధిక అంశాలకూ మధ్యా, చారిత్రక క్రమంలో యాదృచ్ఛికతకూ చైతన్యయుతమైన చర్యలకూ మధ్యా, వస్తుగతమైన అంశాలకూ స్వీయాత్మక అంశాలకూ మధ్యా వుండే సంబంధాలనూ, సామాజిక పరిణామం యొక్క చోదక శక్తులకూ, మానవ అంతస్సారం, ప్రపంచంలో మనిషి స్థానం వంటి అంశాలనూ పరిశీలిస్తుంది. అందువలన చారిత్రక భౌతికవాదం సమాజాన్ని గురించిన తాత్విక విజ్ఞానశాస్త్రంగా వుంటుంది. మార్క్సిస్టు తత్వశాస్త్రంలో అది అవిభాజ్యమైన భాగంగా వుంటుంది. సకల సామాజిక శాస్త్రాలకూ అది ప్రాతిపదికను సమకూరుస్తుంది.

ప్రకృతి నియమాలు-సమాజాభివృద్ధి నియమాలు

చారిత్రక భౌతికవాదం మానవ సమాజాన్ని ప్రకృతిలోని విడదీయరాని భాగంగా గుర్తిస్తుంది. అందువలన ప్రకృతికి సంబంధించిన అత్యంత సాధారణ నియమాలన్నీ మానవ సమాజానికి కూడా వర్తిస్తాయి.

"ప్రకృతి విషయంలో ఏదీ వర్తిస్తుందో సమాజ చరిత్రలోని అన్ని శాఖలకూ, అన్ని శాస్త్రాల సముదాయానికీ, అదే సూత్రం వర్తిస్తుంది. ఇక్కడ కూడా ప్రకృతి రంగంలో వలెనే, ఊహాకల్పిత కృత్రిమ అంతస్సంబంధాలన్నిటినీ పక్కకు నెట్టివేయవలసి వుంది. మానవ సమాజ చరిత్రలో నిర్ణయాత్మకంగా నిరూపితమయ్యే సాధారణ చలన సూత్రాలను పరిశోధించటమనే కర్తవ్యంగా చిట్టచివరకు ఇది తేలుతుంది." (లుడ్విగ్ ఫ్యూయర్‌బా, పే. 48-49)

గతితార్కిక భౌతికవాద నియమాల వలెనే చారిత్రక భౌతికవాద నియమాలు కూడ వస్తుగతమైనవి. అలా అని ప్రకృతి నియమాలకు, సామాజిక నియమాలకు ఎలాంటి తేడా లేనే లేదని అర్థం కాదు. ప్రకృతి నియమాలు వాటంతట అవే గుడ్డిగా అమలులోకి వస్తాయి. కాగా, నిర్దిష్ట లక్ష్యాల కోసం మానవులు చైతన్యయుతంగా చేసే కార్యకలాపాల ద్వారానే సామాజిక నియమాలు అమలులోకి వస్తాయి. కాలంచెల్లి అభివృద్ధికి ఆటంకంగా మారిన ఉత్పత్తి సంబంధాలు రద్దయి కొత్త ఉత్పత్తి సంబంధాలు

అమలులోకి వస్తాయి అని అంటున్నామంటే అవి వాటంతట అవే వస్తాయని కాదు. ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ప్రాతినిధ్యం వహించే వర్గాలుగా వుండే మానవుల చైతన్యయుత కార్యకలాపాల ద్వారా నూతన ఉత్పత్తి సంబంధాలు అమలులోకి వస్తాయి.

నిర్దిష్ట లక్ష్యాలకోసం మానవులు చేసే కార్యాచరణద్వారా సామాజిక నియమాలు అమలులోకి వస్తాయని అంటున్నామంటే, అవి వారి అభీష్టాలపై ఆధారపడి వుంటాయని అంటే స్వీయాత్మకమైనవిగా వుంటాయని అర్థంకాదా? ఎంతమాత్రమూ కాదు. సమాజ చారిత్రక క్రమం మానవుల కార్యాచరణ ద్వారానే జరిగినా అది వారి అభీష్టానుసారం జరగదు. ఆదిమ సమాజంలో జంట పెళ్ళిని కోరుకున్న స్త్రీలు అది తాము భవిష్యత్తులో తల్లి హక్కును కోల్పోవడానికి దారితీస్తుందని ఊహించలేదు. బూర్జువా ప్రజాస్వామిక విప్లవాలలో ప్రధాన చోదకశక్తులుగా వుండిన ప్రజానీకం, తాము భూస్వామ్య పీడననుండి విముక్తికోసం పోరాడుతున్నామని భావించారే తప్ప, ఆ విప్లవ విజయం తమకు వేతన బానిసత్వపు సంకెళ్ళను తొడుగుతుందని ఊహించలేదు. ఎవరికి వారుగా పెట్టుబడిదారులు పెద్ద ఎత్తున ఉత్పత్తిని పెంచేది లాభాలను ఆశించేగానీ అధికోత్పత్తి సంక్షోభాలను కోరుకుని కాదు.

మానవులు ఎల్లప్పుడూ, తాము చైతన్యయుతంగా నిర్దేశించుకున్న కార్యకలాపాలే సాగిస్తారు. ఆ కార్యకలాపాల నడుమ నుండే, వాటి ఫలితంగానే అమలులోకి వచ్చే సామాజికాభివృద్ధి నియమాలు మాత్రం ఎల్లప్పుడూ వాటిని తలపెట్టిన వారి యిష్టాయిష్టాలకు అతీతమైనవిగానే వుంటాయి. అతి తరచుగా వారి సంకల్పానికి భిన్నమైన ఫలితాలకు, వ్యతిరేకమైన ఫలితాలకు కూడా దారి తీస్తుంటాయి. ఎంగెల్స్ ఈ విషయాన్ని ఇలా వివరించాడు.

"ఒక విషయంలో మాత్రం సమాజాభివృద్ధి చరిత్ర, ప్రకృతి చరిత్రకంటే పూర్తిగా భిన్నంగా వుంటుంది. ప్రకృతిలో-ప్రకృతిపై మానవ ప్రభావాన్ని మాత్రం వదిలివేస్తే, చైతన్యరహితమైన శక్తులు గుడ్డిగా ఒకదానిపై మరొకటి చర్యలు జరుపుతూ వుంటాయి. వాటి మొత్తం చర్యా ప్రతిచర్యల ఫలితంగా, సాధారణ సూత్రం అమలులోకి వస్తుంటుంది. అందుకు భిన్నంగా సమాజ చరిత్రలో, పాత్రధారులందరూ చైతన్యం కలిగిన వారు. ఆలోచనతోనూ, ఆవేశంతోనూ ప్రవర్తించే మానవులు, నిర్దిష్ట లక్ష్యాల కొరకు పనిచేసే మానవులు; చైతన్యయుతమైన సంకల్పం లేకుండా, ఉద్దేశిత లక్ష్యం లేకుండా, ఏ ఒక్కపని జరగదు. కాని, చరిత్రగతి అంతర్గతమైన సాధారణ సూత్రాలపై ఆధారపడి నిర్ణయించబడుతుందనే వాస్తవాన్ని మాత్రం ఈ వ్యత్యాసం మార్చలేదు. ఏమంటే మొత్తంగా చూస్తే ఈరంగంలో కూడా, వ్యక్తుల చైతన్య సహితమైన అభీష్టాలెన్ని వున్నా, ఉపరితలం పైన, దాదాపు యాదృచ్ఛికతే రాజ్యం చేస్తూ వుంటుంది. ఆశించినది, దాదాపు ఎప్పుడూ జరగదు.

"అసంఖ్యాకమైన వ్యక్తుల అభీష్టాలు, కార్యాచరణల ఘర్షణ, చరిత్ర రంగంలో కూడా చైతన్యరహిత ప్రకృతి రంగంతో పూర్తిగా తులతూగే పరిస్థితులనే కలిగిస్తాయి. మొత్తంమీద, చారిత్రక ఘటనలను కూడా యాదృచ్ఛికతే నిర్ణయించేటట్లు కనుపిస్తుంది. అంతర్గర్భిత, అంతరంగిక సూత్రాల ప్రకారమే అంతా జరుగుతూ వుంటుంది. ఈ సూత్రాలను పరిశోధించడమే ఇక సమస్య." (లుడ్విగ్ ఫ్యూయర్‌బా, పే. 49-50)

సామాజిక అస్తిత్వం-సామాజిక చైతన్యం

మానవుల సామాజిక అస్తిత్వమే వారి సామాజిక చైతన్యాన్ని నిర్ణయిస్తుంది. ఇది చారిత్రక భౌతికవాదంలోని అత్యంత మౌలిక సూత్రం. చరిత్రపట్ల భౌతికవాద దృక్పథపు క్లుప్త సారాంశమిది. ఈ సూత్రం, మానవ సమాజానికి సంబంధించి తత్వశాస్త్ర మౌలిక ప్రశ్నను పరిష్కరిస్తుంది.

సామాజిక జీవులుగా మానవులు తమ జీవితావసర వస్తూత్పత్తి క్రమంలో అటు ప్రకృతితోనూ ఇటు తమలోతామూ కలిగివుండే భౌతిక సంబంధాలు సామాజిక అస్థిత్వం అవుతాయి. అయితే ఆ సంబంధాలు మానవుల ఇష్టాయిష్టాలకతీతమైనవని విస్మరించరాదు.

ఇక వర్గాల, జాతుల ఇంకా ఇతర చారిత్రక జన సముదాయాల అభిప్రాయాలూ భావాలూ సిద్ధాంతాలూ (రాజకీయ పరమైనవి, న్యాయపరమైనవి, మతపరమైనవి మొదలైనవి), సామాజిక మనస్తత్వమూ కలసి సామాజిక చైతన్యం అవుతాయి.

ఇంతకూ సమాజిక అస్తిత్వం సమాజిక చైతన్యాన్ని నిర్ణయించడమంటే ఏమిటి? ఏ సామాజిక భావాలుగానీ సిద్ధాంతాలు గానీ యాదృచ్ఛికంగా తలెత్తేవి కావు. ఎందువలనంటే ఏ వర్గమైనా గానీ, సమూహమైనా గానీ, వ్యక్తైనా గానీ అస్తిత్వంలో వుండేది, ఆలోచించేది, ప్రవర్తించేది ఒక నిర్దిష్ట ఆర్థిక, సామాజిక, చారిత్రక సన్నివేశంలోనే అయి వుంటుంది. ఆ నిర్దిష్ట పరిస్థితుల నిర్ణయాత్మక ప్రభావాన్ని విస్మరించి వారి అస్థిత్వాన్ని గానీ, చైతన్యాన్ని గానీ వూహించలేం. నూతన భావాలూ, సిద్ధాంతాలూ కొందరు వ్యక్తుల మేధస్సుల నుండి వుద్భవించినట్లుగా కనబడతాయేగానీ అవి వ్యక్తిగతమైనవి కావు. అంతిమంగా వారి నిర్దిష్ట సామాజిక అస్థిత్వమే ఆ నూతన భావాలకూ, సిద్ధాంతాలకూ మూలంగా వుంటుంది. మార్క్సిజం అనే నూతన విప్లవ సిద్ధాంతం మార్క్స్ ఎంగెల్స్‌లచే సృజించబడిన మాటవాస్తవమే. కానీ పెట్టుబడిదారీ విధానంలోని మౌలిక వైరుధ్యాలు పదునెక్కుతూ, కార్మికవర్గం నూతన చరిత్ర చోదకశక్తిగా ఆవిర్భవించి పెట్టుబడిదారీ విధానంతో సంఘర్షిస్తుండిన నిర్దిష్ట చారిత్రక పరిస్థితులలో, కార్మికవర్గపు పోరాట అవసరంగా, చారిత్రక ఆవశ్యతగా మార్క్సిజం అవతరించింది. మార్క్సిజం రూపకల్పనకు కావలసిన భౌతిక ప్రాతిపదికను అప్పటికే సమాజం సృష్టించిందని విస్మరించరాదు. మార్క్స్ ఎంగెల్స్‌లు బానిస సమాజంలో జన్మించి వుంటే ఆనాడే మార్క్సిజాన్ని రూపొందించి వుండేవారనుకోవడం అసంబద్ధమైనది. వ్యక్తులవిగా కనిపించే భావాలూ, సిద్ధాంతాలూ వగైరా సామాజిక చైతన్యం అంతిమంగా నిర్దిష్ట సామాజిక ఆర్థిక చారిత్రక పరిస్థితులచే నిర్దేశించబడతాయి. ఈ విషయాన్ని గుర్తించడంలో పాత భౌతికవాదులు విఫలమయ్యారు.

"భౌతిక జీవితంలోని ఉత్పత్తి విధానమే సామాజిక, రాజకీయ, బౌద్ధిక జీవితక్రమం యొక్క సాధారణ స్వభావాన్ని నిర్ణయిస్తుంది. మానవుల అస్థిత్వాన్ని నిర్ణయించేది వారి చైతన్యం కాదు. తద్విరుద్ధంగా, వారి సామాజిక అస్థిత్వమే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది." (మార్క్స్)

ఆవశ్యకత-స్వేచ్ఛ

ప్రకృతి నియమాలకు భిన్నంగా సామాజిక నియమాలు, సజీవ పాత్రధారులైన మానవుల చైతన్యయుత కార్యకలాపాల ద్వారా అమలులోకి వస్తాయని చెప్పుకున్నాం. అలా అని సామాజిక నియమాల వస్తుగత స్వభావాన్ని అది నిరాకరించదని కూడా చెప్పుకున్నాం. మరి ఇంతకూ ప్రకృతి, సమాజాల వస్తుగత నియమాలకూ, మానవుల కార్యకలాపాలకూ మధ్యవుండే సంబంధమేమిటి? సమాజ చారిత్రకాభివృద్ధి క్రమంలో మానవుని చైతన్యయుతమైన కార్యకలాపాల పాత్ర ఎలాంటిది? మరొక విధంగా చెప్పాలంటే మానవుడు తన భవితవ్యానికి తానే కర్త కాగలుగుతాడా? మానవుడు స్వేచ్ఛాజీవి కాగలుతాడా లేక ప్రాకృతిక, సామాజిక నియమాలకు బానిసగా జీవించవలసిందేనా? ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఆవశ్యకత-స్వేచ్ఛల మధ్య సంబంధం ఏమిటి?

ఆవశ్యకత-స్వేచ్ఛల మధ్యగల ఈ సంబంధాన్ని గురించిన చర్చ ప్రాచీనకాలం నుండి సాగుతూనే వుంది. కొన్ని నిర్దిష్ట పరిస్థితుల నుండి కొన్ని నిర్దిష్టమైన పరిణామాలు అనివార్యంగా సంభవించడమే ఆవశ్యకత. (ఆవశ్యకత అనే భావనను మనం ముందు పేరా లో చర్చించాం) ప్రకృతి, సమాజాల చలనాన్ని, అభివృద్ధిని శాసించే నియమాలన్నీ, వాటినుండి సంభవించే పరిణామాలన్నీ అనివార్యమైనవే, ఆవశ్యకమైనవే. ఈ నియమాలన్నీ బహిర్గతమైనవి, వస్తుగతమైనవి. మానవుని ఇష్టాయిష్టాలు, కార్యకలాపాలు వాటిని ప్రభావితం చేయజాలవు. మరి అలాంటపుడు ఆవశ్యకత ముందు మానవులు నిమిత్తమాత్రులే కాదా? మానవులు చైతన్యయుతంగా తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలనుకుని కృషి చేయడం వ్యర్థమే కాదా? ఆవశ్యకతను గుర్తించడమంటే విధి వాదాన్ని అనుసరించటమే కాదా?

ఆవశ్యకతను గుర్తించడమంటే మానవుల స్వేచ్ఛను, నిర్ణయ స్వేచ్ఛను నిరాకరించటం కాదు. సామాజిక పరిణామంలో మానవుల కార్యకలాపాలు నిర్వహించే పాత్రను చిన్నచూపు చూడడం కాదు. ఆవశ్యకతను మాత్రమే గుర్తించి, మానవులు ఆవశ్యకతను తలదాల్చి నడుచుకోవలసిందేనని చెప్పేది నిర్ణాయకవాదం, విధివాదం అవుతుంది. మన భావవాదులు చెప్పే కర్మసిద్ధాంతం కూడా ఇదే కోవకు చెందుతుంది.

మరొకవంక దీనికి పూర్తి విరుద్ధంగా మానవులకు గల స్వేచ్ఛపైన, నిర్ణయ స్వేచ్ఛపైన ఎలాంటి బహిర్గతమైన ప్రభావాన్ని గాని, పరిమితిని గాని గుర్తించ నిరాకరించే ధోరణి కూడా వుంది. ప్రత్యేకించి అస్తిత్వవాదులు స్వేచ్ఛను పూర్తిగా వ్యక్తిగతమైనదిగా పరిగణిస్తారు. ఈ రెండు ధోరణులు ఆవశ్యకత-స్వేచ్ఛలను ఒకదాని కొకటి పోటీగా నిలుపుతాయి. ఈ రెంటికి పొసగదని భావిస్తాయి.

కాగా చారిత్రక భౌతికవాదం ఆవశ్యకత-స్వేచ్ఛల మధ్యగల గతితార్కిక సంబంధాన్ని గుర్తిస్తుంది. వ్యక్తులు లేదా వర్గం లేదా సమాజం ఆవశ్యకతను గుర్తించి దానికి అనుగుణంగా కార్యాచరణకు దిగి తాము ఆశించిన లక్ష్యాలను సాధించగలగడమే స్వేచ్ఛ అని అది నిర్వచిస్తుంది. దీనినే ఎంగెల్స్ క్లుప్తంగా "ఆవశ్యకతను గుర్తించడమే స్వేచ్ఛ" అని పేర్కొన్నాడు.

చారిత్రక భౌతికవాదం చరిత్ర చోదకశక్తులనూ, నియమాలనూ శోధిస్తుదనీ అధ్యయనం చేస్తుందనీ చెప్పుకున్నాం. సమాజాభివృద్ధి నియమాలను తెలుసుకోవడం ఎందుకోసం? తదనుగుణమైన ఆచరణ ద్వారా సామాజిక జీవితాన్ని మెరుగుపరచుకోవడం కోసం. అంటే ఆవశ్యకతను గుర్తించి తదనుగుణంగా మానవ కార్యాచరణను మలుచుకోవడమనే లక్ష్యం చారిత్రక భౌతికవాదంలో అంతర్లీనంగా వుంటుంది. మానవుడు ఎంతగా వస్తుగతమైన ప్రాకృతిక నియమాలనూ, సామాజిక నియమాలను తెలుసుకోగలుగుతాడో ఆ మేరకు అతడు స్వేచ్ఛను సాధిస్తాడు. స్వేచ్ఛ అంటే వస్తుగత నియమాలనుండి స్వేచ్ఛకాదు, వ్యక్తి, తన ఇష్టానుసారం ప్రవర్తించడం కాదు.

"మన మనస్సుకు స్వతంత్రంగా, వెలుపల అస్తిరత్వంలో వుంటూ పనిచేసే ప్రకృతి నియమాన్ని మనం తెలుసుకునేంతవరకూ కూడా, అది మనలను 'గుడ్డి ఆవశ్యకత' కు బానిసలుగా చేస్తుంది. (మార్క్స్ వెయ్యిసార్లు పునరుద్ఘాటించినట్లు) మన అభీష్టానికి స్వతంత్రంగా పనిచేసే ఆ నియమాన్ని తెలుసుకోవడంతోనే మనం ప్రకృతికి అధిపతులంగా మారిపోతాం. మానవుని ఆచరణలో వ్యక్తమయ్యే ప్రకృతిపై ఆధిపత్యం, ప్రాకృతిక దృగ్గోచరాంశాలూ క్రమాలూ మానవుని తలలో వస్తుగతంగా సరిగ్గా ప్రతిఫలించిన దాని ఫలితమే. (ఎంప్రియో క్రిటిసిజం, పే. 190)

ఆవశ్యకతను గుర్తించడమంటే కేవలం గుర్తించడం మాత్రమే కాదు, తదనుగుణంగా కార్యాచరణకు దిగడం కూడా. నిప్పును కనిపెట్టడమనేది, ఆవిరి యంత్రాన్ని కనిపెట్టడం కన్నా కూడా అత్యంత ప్రబలమైన రీతిలో మానవజాతికి స్వేచ్ఛను ప్రసాదించిందని ఎంగెల్స్ చెప్పాడు. అయితే ఆ స్వేచ్ఛ నిప్పును కేవలం కనిపెట్టడం వల్లనే లభించింది కాదు. నిప్పును కనిపెట్టి ఒక ప్రకృతి శక్తిని అదుపులో వుంచుకుని వుపయోగించుకోవడం వల్లనే మానవ జాతికి ఆ గొప్ప స్వేచ్ఛ లభించింది.

"స్వేచ్ఛ అంటే ప్రాకృతిక నియమాల నుండి స్వాతంత్ర్యమనే కలకాదు. స్వేచ్ఛ, ఆ నియమాల గురించిన జ్ఞానంతోనూ, నిర్దిష్ట లక్ష్యాలకోసమై క్రమపద్ధతిలో అవి పనిచేసేట్లుగా చేయడం ద్వారా లభించే అవకాశంతోనూ కూడినదిగా వుంటుంది." (యాంటిడూరింగ్, పే. 144)

పెను తుఫానులు, ఉప్పెనలు, భూకంపాలు, అగ్నిపర్వతాల విస్ఫోటనాలు వంటి వినాశకర పరిణామాలు ప్రకృతిలో ఆవశ్యంగానే సంభవిస్తాయి. మానవుడు వాటిని ఎన్నటికయినా నివారించ గలుగుతాడా? స్వేచ్ఛ అంటే ఆవశ్యక పరిణామాలను నివారించడం కాదు. వస్తుగత

నియమాలకు విరుద్ధంగా మన ఇష్టమొచ్చిన రీతిలో ప్రవర్తించగలగడం కాదు. ఆవశ్యకతను గుర్తించడం ద్వారా మనిషి తనకు అనుకూలమైన ఆవశ్యక పరిణామాలను వేగిరపరచడానికి గల అవకాశాలను వుపయోగించుకోగలుగుతాడు, లేదా తనకనుగుణంగా మలుచుకోగలుగుతాడు. తనపైన వినాశకర ప్రభావాన్ని చూపగల ప్రతికూల పరిణామాలను కలిగించే ఆవశ్యకతను గుర్తించడం ద్వారా దాని వినాశకర ప్రభావాన్ని పరిమితం చేయడానికి, లేదా దాని నుండి తప్పుకోవడానికి గల అవకాశాలను వుపయోగించుకోగలుగుతాడు. పైన చెప్పిన వినాశకర ప్రకృతి పరిణామాల ఆవశ్యకతను అర్థం చేసుకుని, ముందుగానే వాటిని గురించి తెలుసుకుని వాటి వినాశకర ప్రభావం నుండి తప్పుకోడానికీ, దానిని పరిమితం చేయడానికీ మానవుడు చైతన్యయుతంగా కృషి చేయగలుగుతాడు. ఆ మేరకు వాటినుండి స్వేచ్ఛను సంపాదించగలుగుతాడు.

విప్లవం అంటే వర్గయుద్ధం. ఈ యుద్ధంలో నష్టాలు ఆవశ్యంగానే అనివార్యం. అయితే, ఆవశ్యకతను గుర్తించడం ద్వారా అంటే యుద్ధ నియమాలను అధ్యయనం చేసి తెలుసుకోవడం ద్వారా కార్మికవర్గ పార్టీ, ఈ యుద్ధం ఆవశ్యకంగా విప్లవ శక్తులపై చూపగల వినాశకర ప్రభావాన్ని పరిమితం చేయగలుగుతుంది. అలా చేయడం ద్వారానే విప్లవ శక్తులు శత్రువు పైన పైచేయి సాధించగలుగుతాయి. ప్రజలు అజేయులు నిజమే. కానీ ప్రజలు ఆవశ్యకతను గుర్తించి తదనుగుణంగా ఆచరణకు దిగితేనే అజేయులు కాగలుగుతారు. అంటే, కార్మికవర్గ పార్టీ అజేయులైన ప్రజలను ప్రజాయుద్ధపు వస్తుగత నియమాలకు అనుగుణంగా నడపడం ద్వారా మాత్రమే విప్లవం విజయవంతం అవుతుంది.

విప్లవకారులు రూపొందించుకునే టెక్ జాగ్రత్తలు శత్రుదాడి ఆవశ్యకంగా వారిపై చూపే వినాశకర ప్రభావాన్ని పరిమితం చేయడానికి వుద్దేశించినవి. అలా రూపొందించుకున్న టెక్ జాగ్రత్తలన్నీ ప్రపంచ వ్యాప్తంగా పీడిత ప్రజలు సాగించిన సాగిస్తున్న విప్లవ పోరాటాల, యుద్ధాల అనుభవం నుండి రూపొందినవి. ఆ పోరాటాల, యుద్ధాల వస్తుగత నియమాలను అంటే ఆవశ్యకతను అధ్యయనం చేసి అర్థం చేసుకోవడం వలన రూపొందినవి. ఆ ఆవశ్యకతను గుర్తించి, తదనుగుణంగా ఆచరణను మలచుకోవడం ద్వారా విప్లవకారులు ప్రతీఘాతుక శక్తుల దాడులనుండి ఆవశ్యకంగా సంభవించే వినాశకర పరిణామాల ప్రభావాన్ని పరిమితం చేయగలుగుతారు. టెక్నికల్ జాగ్రత్తలను నిర్లక్ష్యం చేయడమన్నా, ప్రజాయుద్ధ సూత్రాలను నిర్లక్ష్యం చేయడమన్నా ఆవశ్యకతను గుర్తించ నిరాకరించడమే. ఆవశ్యకత కనుగుణంగా ప్రవర్తించ నిరాకరించడమే. అలాంటి ఆచరణ స్వేచ్ఛను ప్రసాదించదు, ఆవశ్యకతకు బానిసలను చేస్తుంది.

అందువలన స్వేచ్ఛ లేదా నిర్ణయస్వేచ్ఛ అంటే వాస్తవాల గురించిన జ్ఞానంపై ఆధారపడి నిర్ణయాన్ని తీసుకునే సామర్థ్యమే. "అందువలన ఒక నిర్దిష్ట సందర్భానికి సంబంధించి ఒక మనిషి నిర్ణయం, అది ఎంత ఎక్కువ ఆవశ్యకత సారంతో చేయబడినదైతే అంత స్వేచ్ఛాయుతమైనదై వుంటుంది." "మనపైనా, బాహ్య ప్రకృతిపైనా అదుపులో, సహజ ఆవశ్యకత గురించిన జ్ఞానం పునాదిపై నిలిచిన అదుపులో స్వేచ్ఛ వుంది, అందువలన ఆవశ్యకంగా ఇది చారిత్రకాభివృద్ధి ఫలితం." (యాంటీడూరింగ్, పే. 144)

ఆవశ్యకతను గుర్తించి తదనుగుణంగా తన కార్యకలాపాలను మలచుకునే క్రమంలోనే మానవులు ప్రకృతి శక్తులపైన ఆధిపత్యాన్ని సాధించారు. ఒకవిధంగా చెప్పాలంటే, మనిషి జంతు దశ నుండి విడివడిన నాటినుండి నేటి వరకు సాగుతున్న పురోగమనమంతా ఆవశ్యకతను గుర్తించి స్వేచ్ఛను సాధించే క్రమంలో సాగుతున్న పురోగమనమే.

"జంతు ప్రపంచం నుండి విడివడిన తొలి మానవులు జంతువులలాగనే స్వేచ్ఛలేని వారే. అయితే నాగరికతలో వారు వేసిన ప్రతి ముందడుగు స్వేచ్ఛ దిశగా వేసినదే."

సామాజిక జీవితానికి భౌతిక పునాది ఉత్పత్తి విధానం

మానవ జీవితావసరాలను ఉత్పత్తిచేసే క్రమంలోనే, సామాజిక జీవితం నుంచే పదార్థ చలనపు ఉన్నతరూపమైన సమాజం ఏర్పడింది. సమాజం అంటే, ప్రకృతి పరిణామంలో ఒక శాఖగా వేరపడి చారిత్రకంగా అభివృద్ధి చెందుతున్న మానవ జీవితమే. అందువలన సమాజంలో అతి ప్రధానమైన అంశం మానవులే. మనిషి లేనిదే సమాజం లేనేలేదు. అయితే సమాజం అంటే మానవ సమూహం మాత్రమే అనుకోరాదు. భౌతిక వస్తూత్పత్తి క్రమంలో ఏర్పడే నిర్దిష్ట ఆర్థిక సంబంధాలతోనూ వాటిపై ఆధారపడిన ఇతర సామాజిక రాజకీయ సాంస్కృతిక క్రమాలతోనూ ఒకరితో ఒకరు విడదీయరాని విధంగా ముడిపడివుండే చారిత్రక జనసమూహమే సమాజం.

మానవుని కార్యకలాపాలన్నింటిలో అత్యంత ప్రాథమికమైనవి ఉత్పత్తి కార్యకలాపాలే. జీవితావసర వస్తువులను ఉత్పత్తి చేసుకోవడం అనే లక్షణమే మానవుణ్ణి ఇతర జంతుజాలం నుండి ప్రాథమికంగా వేరుచేస్తున్నది. జంతు దశనుండి వేరపడిన మానవుడు శ్రమ సాధనాల సహాయంతో ప్రకృతి పైన శ్రమ చేయడం ద్వారా తనకవసరమైన వస్తువులను తయారుచేసుకోవడం ప్రారంభించాడు. ఆదిమానవుడు శ్రమ సాధనాలను తయారుచేయడం నేర్చుకోవడంతో ఉత్పత్తి ప్రారంభమైంది. ఒక జీవితావసర వస్తువును తయారుచేయాలన్న నిర్దిష్ట లక్ష్యంతో శ్రమ సాధనాలను వుపయోగించి ప్రకృతిపైన లేదా శ్రమ లక్ష్యాలపైన శ్రమచేసి వస్తువును తయారుచేయడాన్ని ఉత్పత్తి అంటాము. ఆదిమానవుడు మొట్టమొదటి శ్రమ సాధనాలైన రాతి ఆయుధాలను (అవి ఎంత మొరటువి అయినప్పటికీ) తయారుచేయడం నేర్చుకోవడంతో శ్రమ, ఉత్పత్తి మొదలయ్యాయి. శ్రమ మానవుణ్ణి సంఘజీవి చేసింది. అంతేకాదు, అది అతడి శారీరక, మానసిక శక్తుల అభివృద్ధిలో అత్యంత కీలకమైన పాత్ర నిర్వహించింది. అందువల్లనే ఎంగెల్స్ "ఒక అర్థంలో చెప్పాలంటే మానవుణ్ణి సృష్టించింది శ్రమే" అని అన్నాడు.

శ్రమచేసే క్రమంలో, ఉత్పత్తి చేసే క్రమంలో మానవులు పరస్పరం ఒకరిపై ఒకరు ఆధారపడి వుండటం, సంబంధాలు కలిగి వుండటం అనివార్యం. ఉత్పత్తి క్రమంలో మానవుల మధ్య ఏర్పడే సంబంధాలే మానవ

సమాజ నిర్మాణానికి పునాది అయ్యాయి. ఉత్పత్తి కార్యకలాపాల ప్రాతిపదికపైనే మానవుని ఇతర సామాజిక కార్యకలాపాలన్నీ వృద్ధి చెందాయి. అందువలన మానవ సమాజానికి పునాది ఉత్పత్తి విధానమే. రాజకీయ, సాంస్కృతిక తదితర ఆర్థికేతర సామాజిక అంశాలన్నీ ఈ పునాది నుండి పుట్టినవే. అందువలన వాటిని ఉపరితల నిర్మాణం అంటాం. ఈ పునాది ఉపరితలాలు రెంటితో కూడిన మొత్తం సామాజిక నిర్మాణాన్నే సామాజిక ఆర్థిక వ్యవస్థ అంటాం. వివిధ చారిత్రక దశలగుండా సాగుతున్న మానవ సమాజం అభివృద్ధి క్రమానికి చోదకశక్తి ఉత్పత్తి విధానంలోని విరుద్ధాంశాల మధ్య వుండే ఘర్షణే.

ఉత్పత్తి విధానం సామాజిక జీవితానికి భౌతిక పునాదిగా వుంటుందనే విషయాన్ని గుర్తించడం, చరిత్ర పట్ల భౌతికవాద భావనలో ముఖ్యాంశంగా వుంటుంది.

ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాల మధ్య వైరుధ్యమే సమాజానికి చోదకశక్తి

మొట్టమొదట సామాజిక వ్యవస్థ అయిన అదిమ సమాజం నుండి నేటి పెట్టుబడిదారీ విధానం వరకూ మానవ సమాజం వివిధ దశలగుండా అభివృద్ధి చెందుతూ వచ్చింది. నూతన ఉత్పత్తి విధానం అమలులోకి రావటంతో మొత్తంగా సామాజిక ఆర్థిక నిర్మాణమే నూతన దశకు చేరుతుంది. కాబట్టి మానవ సమాజ చరిత్రలోని దశలన్నీ నిజానికి ఉత్పత్తి విధానపు అభివృద్ధి దశలేనని చెప్పవచ్చు. సామాజిక అభివృద్ధి స్థాయిననుసరించి వివిధ రకాలైన ఉత్పత్తి విధానాలేర్పడుతూ, తదనుగుణంగా భిన్న ఆర్థిక సామాజిక వ్యవస్థలు ఏర్పడే క్రమంలో సమాజం అభివృద్ధి చెందుతూ వచ్చింది. అందువలన మానవ సమాజ చరిత్ర అంటే ఉత్పత్తి విధానాల చరిత్రేనని చెప్పుకోవచ్చును. మరి మానవ సమాజ చరిత్రకు చోదకశక్తిగా పనిచేసేది ఏమిటి?

ఉత్పత్తి విధానపు రెండు పార్శ్వాలైన ఉత్పత్తి శక్తులు ఉత్పత్తి సంబంధాల మధ్యవుండే వైరుధ్యమే మానవ సమాజానికి చోదకశక్తి. ఈ విరుద్ధాంశాల ఘర్షణ మూలంగానే సమాజం వివిధ దశల గుండా పురోగమిస్తూ వస్తున్నది.

ఉత్పత్తి శక్తులు: ఉత్పత్తి అంటే ఒక విధంగా చెప్పాలంటే మానవుడు ప్రకృతిపై సాగించే పోరాటం. ఉత్పత్తి అనేది ప్రాథమికంగా ప్రకృతి వనరులను మానవ జీవితావసర వస్తువులుగా మలచుకోవడానికి జరిగే కృషి. రైతుల ధాన్యం పండించడమైనా, కుమ్మరి కుండను చేయడమైనా, మిల్లు కార్మికులు బట్టను నేయడమైనా, రైలింజను లేదా రాకెట్ తయారీ ఏదైనా గానీ ప్రకృతి ప్రసాదించిన వనరులను మానవునికవసరమైన వస్తువులుగా మార్చే ప్రక్రియలే. ఉత్పత్తి శక్తులంటే ఉత్పత్తి చేయడం కోసం మానవుడుపయోగించే సకల అంశాలూ శక్తులేనని చెప్పవచ్చు.

ఉత్పత్తి శక్తులను స్థూలంగా ఉత్పత్తి సాధనాలు, మానవ శ్రమ అని రెండుగా విభజించవచ్చును. శ్రమ అంటే ఉత్పత్తి చేసే శ్రామికులే (రైతులు, కార్మికులు, చేతివృత్తుల వారు). ఉత్పత్తి సాధనాల సహాయంతో శ్రమచేసి శ్రామికులు ఉత్పత్తి చేస్తారు.

ఉత్పత్తి సాధనాలు: ఉత్పత్తి సాధనాలంటే ఉత్పత్తి శక్తులలోని పాదార్థిక అంశాలు. భూములు, గనులు, అడవులు, ముడిపదార్థాలు, నాగళ్ళు, గొడ్డళ్ళు, మగ్గాలు, యంత్రాలు మొదలైన ఉత్పత్తికి అవసరమైన పాదార్థిక అంశాలన్నీ ఉత్పత్తి సాధనాలే. వీటిలో నాగళ్ళు, గొడ్డళ్ళు, మగ్గాలు, యంత్రాలు వంటివి శ్రమ సాధనాలు కాగా, భూములు, గనులు, అడవులు, ముడిపదార్థాలు మొదలైనవి శ్రమ లక్ష్యాలు.

శ్రమ సాధనాల సహాయంతో శ్రామికులు తమ శ్రమశక్తిని శ్రమ లక్ష్యాలపైన ప్రయోగిస్తారు. ఫలితంగా శ్రమ లక్ష్యాలు జీవితావసర వస్తువులుగా మారుతాయి. అంటే శ్రామికులు శ్రమ సాధనాల సహాయంతో శ్రమ చేస్తారు.

ఏ వస్తువును ఉత్పత్తి చేయాలన్నా శ్రమ, ఉత్పత్తి సాధనాలూ రెండూ తప్పనిసరిగా అవసరం. వీటిలో ఏది లోపించినా ఉత్పత్తి జరగడం అసంభవం. అంటే ఉత్పత్తి శక్తులలోని పాదార్థిక, మానవ అంశాలు రెండూ ఉత్పత్తికి తప్పనిసరి.

ఉత్పత్తి సంబంధాలు: ఉత్పత్తి శక్తులు ఉత్పత్తి విధానానికి సంబంధించిన ఒక పార్శ్వానికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తాయి. ఉత్పత్తి జరిగే క్రమంలో మానవుల మధ్య ఏర్పడే సంబంధ బాంధవ్యాలను ఉత్పత్తి సంబంధాలు లేదా ఆర్థిక సంబంధాలు అని అంటారు. ఉత్పత్తి శక్తుల వల్లనే ఉత్పత్తి జరిగేమాట నిజమేగానీ, ఉత్పత్తిలో పాల్గొనే మానవుల మధ్య సంబంధ బాంధవ్యాలు లేనిదే ఉత్పత్తి శక్తులు ఒకటిగా కలసి పనిచేయవు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో పెట్టుబడిదారుడు-కార్మికుడు అనే ఉత్పత్తి సంబంధం కారణంగానే ఉత్పత్తి సాధనాలు, శ్రమశక్తి కలసి ఉత్పత్తి చేయగలుగుతాయి. లాకౌట్లు, సమ్మెల వంటి కారణాలతో ఆ సంబంధం దెబ్బతిన్నప్పుడల్లా ఉత్పత్తి నిలిచిపోవడం మనం చూస్తున్నదే. ఏ సమాజంలోనైనా ఏఅభివృద్ధి దశలోనైనా నిర్దిష్ట ఉత్పత్తి సంబంధాలలోనే ఉత్పత్తి శక్తులు పనిచేస్తాయి. అస్తిత్వంలో వుంటాయి. ఉత్పత్తి శక్తుల అభివృద్ధి స్థాయిననుసరించే నిర్దిష్ట ఉత్పత్తి సంబంధాలు ఏర్పడతాయి. అమలులోకి వస్తాయి. ఇలా ఈ రెండూ ఉత్పత్తి విధానంలో ఒకే ఐక్యతగా వుంటాయి. ఆ ఐక్యత లేకుంటే ఉత్పత్తి అసంభవం. ఉత్పత్తి శక్తులకు, ఉత్పత్తి సంబంధాలకు మధ్య ఐక్యత మాత్రమే కాదు. అనుగుణ్యత కూడా వుంటుంది. ఏ ఉత్పత్తి సంబంధాలైనా గానీ ఆనాటి ఉత్పత్తి శక్తుల అభివృద్ధి స్థాయికి అనుగుణంగా వుండి వాటి అభివృద్ధికి దోహదపడేవిగా వుండాలి.

ఉత్పత్తి సంబంధాలే మొత్తంగా ఉత్పత్తి విధానపు స్వభావాన్ని నిర్ణయిస్తాయి. ఉత్పత్తి సంబంధాలు మారిపోవడమంటే మొత్తంగాసమాజానికి పునాది అయిన ఉత్పత్తి విధానమే మారిపోవడం. పెట్టుబడిదారుడు-కార్మికుడు అనే సంబంధం రద్దుకావడమంటే


పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమే రద్దయిపోవడం; భూస్వామి-రైతు సంబంధం రద్దుకావడమంటే భూస్వామ్య ఉత్పత్తి విధానమే రద్దుకావడం. అందువల్లనే మానవ సమాజ చరిత్ర అంటే ఉత్పత్తి సంబంధాల చరిత్రేనని కూడా అనవచ్చు.

ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాల మధ్య ఐక్యత మాత్రమే కాదు ఘర్షణ కూడా వుంది. ఇవి రెండూ ఉత్పత్తి విధానంలోని రెండు విరుద్ధాంశాలు. ఈ రెండు విరుద్ధాంశాల మధ్య ఘర్షణ కారణంగానే ఉత్పత్తి విధానం ఒక దశనుండి మరోదశకు గంతు వేస్తుంది. సమాజం ఒక దశనుండి మరోదశకు పురోగమిస్తుంది. అందువల్లనే ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాల మధ్య వైరుధ్యాన్ని సమాజానికి చోదకశక్తి అంటాము.

ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాలలో ఉత్పత్తి శక్తులు ప్రత్యేకించి నిరంతర చలనశీలమైనవి. నిరంతరమూ మార్పుచెందేటటువంటి, అభివృద్ధి చెందేటటువంటి స్వభావం కలిగినవి. ప్రత్యేకించి ఉత్పత్తి శక్తుల్లలోని శ్రమ సాధనాలు మరింత చురుకైనవి. కొత్త శ్రమ సాధనాల ప్రవేశంతో మొత్తంగా ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందుతుంటాయి. ఉత్పత్తి శక్తులతో పోలిస్తే ఉత్పత్తి సంబంధాలు కొంత నిలకడగా వుండేవి. ఒక సామాజిక దశ అంతటా అవి నిలకడగా వుంటాయి. ఒక అభివృద్ధి దశకు అనుగుణమైన ఉత్పత్తి సంబంధాలు ఏర్పడడంతోనే, అవి ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందడానికి అనువైన పరిస్థితిని కలిగిస్తాయి. ఫలితంగా ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందుతూ వుంటాయి. మరోవంక ఆ ఉత్పత్తి సంబంధాలు ఆ సామాజిక దశ అంతటా మారకుండా వుంటాయి. ఉత్పత్తి శక్తులకూ, సాపేక్షికంగా నిలకడగా వున్న ఉత్పత్తి సంబంధాలకూ మధ్యవున్న వైరుధ్యం, ఉత్పత్తి శక్తుల అభివృద్ధి ఒక స్థాయికి చేరిన తర్వాత విషమిస్తుంది. ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి అంతవరకూ దోహదం చేస్తూ వచ్చిన ఆ ఉత్పత్తి సంబంధాలే వాటి అభివృద్ధికి ప్రతిబంధకాలుగా మారతాయి. ఆ ఉత్పత్తి సంబంధాల చట్రంలో ఇక ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందజాలని, ఇమడజాలని పరిస్థితి ఏర్పడుతుంది. ఫలితంగా పాత ఉత్పత్తి సంబంధాల స్థానే ఉత్పత్తి శక్తుల అభివృద్ధి స్థాయికి అనుగుణంగా వున్న కొత్త ఉత్పత్తి సంబంధాలు ఏర్పడతాయి. పాత ఉత్పత్తి సంబంధాలస్థానే కొత్త ఉత్పత్తి సంబంధాలేర్పడడం సామాజిక విప్లవం ద్వారానే జరుగుతుంది. ఎందువల్లనంటే పాత ఉత్పత్తి సంబంధాలకు ప్రాతినిధ్యం వహించే సామాజిక శక్తులు ఉత్పత్తి సంబంధాలు మారడాన్ని ప్రతిఘటిస్తాయి. కొత్త ఉత్పత్తి సంబంధాలను అమలులోకి తేవలసి వుంటుంది. ఈ కొత్త ఉత్పత్తి సంబంధాలు ఆనాటి ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి తగినవిగా వుండి అవి అభివృద్ధి చెందడానికి దోహదం చేస్తాయి. కానీ, కొత్త ఉత్పత్తి సంబంధాలేర్పడినప్పటికీ ఉత్పత్తి శక్తులు ఉత్పత్తి సంబంధాల మధ్య వైరుధ్యం అంతరించిపోదు. తిరిగి కొంతకాలం తరువాత ఈ కొత్త ఉత్పత్తి సంబంధాలు సైతం ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ప్రతిబంధకమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. సమాజం తిరిగి సామాజిక విప్లవ దశలోకి ప్రవేశిస్తుంది. ఆర్థిక పునాదిలో ఇలా సంభవించే విప్లవం వలన మొత్తంగా సమాజమే మరొక ఉన్నత దశకు చేరుకుంటుంది. మొత్తంగా ఉపరితల నిర్మాణమంతా కూడా మారిపోతుంది.

"మానవులు తమ జీవితానికి సంబంధించిన సామాజిక ఉత్పత్తిలో తమ ఇష్టాయిష్టాలకు అతీతమైన, ఆవశ్యకమైన నిర్దిష్ట ఉత్పత్తి సంబంధాలను ఏర్పరచుకుంటారు; ఈ ఉత్పత్తి సంబంధాలు వారి భౌతిక ఉత్పత్తి శక్తుల అభివృద్ధి యొక్క నిర్దిష్ట దశకు అనుగుణంగా వుంటాయి. ఈ ఉత్పత్తి సంబంధాల మొత్తమే సమాజపు ఆర్థిక నిర్మాణంగా వుంటుంది. అదే దాని నిజమైన పునాది. దానిపైనే చట్టపరమైన, రాజకీయపరమైన ఉపరితల నిర్మాణం తలెత్తుతుంది. సామాజిక చైతన్యపు నిర్దిష్ట రూపాలు దాని కనుగుణంగానే వుంటాయి. భౌతిక జీవితంలోని ఉత్పత్తి విధానమే సామాజిక, రాజకీయ, బౌద్ధిక జీవన క్రమాల యొక్క సాధారణ స్వభావాన్ని నిర్ణయిస్తుంది. మానవుల అస్తిత్వాన్ని నిర్ణయించేది వారి చైతన్యం కాదు, తద్విరుద్ధంగా, వారి సామాజిక అస్తిత్వమే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది. సమాజపు భౌతిక ఉత్పత్తి శక్తులు వాటి అభివృద్ధిలోని ఒక నిర్దిష్ట దశలో అస్తిత్వంలో వున్న ఉత్పత్తి సంబంధాలతో లేదా ఉత్పత్తి సంబందాలకు చట్టపరమైన వ్యక్తీకరణ తప్ప వేరేమీ కాని ఆస్థి సంబంధాలతో-ఏ ఆస్థి సంబంధాలలో అయితే అవి అంతకు ముందువరకూ పనిచేస్తూ వచ్చాయో ఆ ఆస్థి సంబంధాలతో ఘర్షణలోకి వస్తాయి. ఉత్పత్తి శక్తుల అభివృద్ధి యొక్క రూపాలుగా వుండిన ఈ సంబంధాలు కాస్తా వాటికి ఇక సంకెళ్ళుగా పరిణమిస్తాయి. అప్పుడిక సామాజిక విప్లవదశ ప్రారంభమౌతుంది. ఆర్థిక పునాది మారడంతో బ్రహ్మాండమైన ఉపరితల నిర్మాణం మొత్తం కొద్దో గొప్పో వేగంగా పరివర్తన చెందుతుంది. ఇటువంటి పరివర్తనలను పరిశీలించేటప్పుడు, ప్రకృతి శాస్త్రాలంత ఖచ్చితత్వంతో నిర్ణయించగలిగిన ఉత్పత్తికి సంబంధించిన ఆర్థిక పరిస్థితుల భౌతిక పరివర్తనకూ, న్యాయపరమైన రాజకీయపరమైన రసజ్ఞానపరమైన తాత్వికపరమైన రూపాల పరివర్తనకూ ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఏ భావజాల రూపాలలో అయితే ప్రజలు ఈ ఘర్షణను గుర్తించి పోరాడుతారో ఆ భావజాల రూపాల పరివర్తనకూ మధ్యగల తేడాను సదా గుర్తించాలి. ఒక వ్యక్తి గురించిన మన అభిప్రాయం ఏ విధంగా అయితే ఆ వ్యక్తి, తన గురించి తానేమనుకుంటాడు అనే దానిపై ఆధారపడి వుండదో, అలాగే అలాంటి పరివర్తనాదశను గూడా ఆ దశకు సంబంధించిన స్వీయ చైతన్యంతో అంచనా వేయజాలం, తద్విరుద్ధంగా భౌతిక జీవితంలోని వైరుధ్యాలనుండీ, సామాజిక ఉత్పత్తి శక్తుల ఉత్పత్తి సంబంధాల మధ్యనున్న ఘర్షణనుండీ ఆ చైతన్యాన్ని వివరించాలి.. స్థూలంగా చెప్పాలంటే, ఆసియాఖండ, పురాతన, ఫ్యూడల్, ఆధునిక బూర్జువా ఉత్పత్తి విధానాలను సమాజపు ఆర్థిక నిర్మాణపు ప్రగతిననుసరించి వచ్చిన వివిధ శకాలుగా చెప్పుకోవచ్చును." (మార్క్స్, ఎంగెల్స్ సెలెక్టెడ్ వర్క్స్, పే. 118)

PRINTED BOOK
RNI Regn. No. APTEL/2003/11482
Postal Regn. No. LII/RNP/H-HD-1029/2004-06



Owned, Printed and Published by V.Hanumantha Rao at G1 Mythri Residency, 3-6-394, Road No.3, Himayat Nagar, Hyderabad-5000 029 Ph: 55843495 DTP at Samata Graphics, Hyderabad. Printed at Akruti, Chikkadapalli, Hyderabad.
Editor: N.Venugopal

VEEKSHANAM
G1. MYTHRI RESIDENCY,
3-6-394, ROAD NO.3